# స్వతంత్రవృత్తులు

అనువాదం

జాస్తి జగన్నాథం

కిసాన్ హోం, తెనాలి

ప్రథమ ముద్రణ

నవంబరు 1959

మూల్యం : 0-50

ప్రతులకు

టాగూర్ బుక్ హౌస్, తెనాలి.

'వాహిని' కార్యాలయం, విజయవాడ - 2

ది ఓరియంట్ పవర్ ప్రెస్,

తెనాలి

# ప్రథమాధ్యాయం

పాశ్చాత్య సంఘాలలోను, రష్యాలోను పొందిన అనుభవాలనుబట్టి, అక్కడి పరిస్థితులనుచూచి, ఆ దేశాల ఆర్థిక సాంఘిక వ్యవస్థల నిర్వాహణ సూత్రాల ఆధారంతో మన ప్రణాళికాసంఘం ఇక్కడి సాంఘిక ఆర్థిక వ్యవస్థలను పరిశీలించి వర్గీకరిస్తున్నది. ఈ కారణంచేత వీరు స్వయంకల్పిత వృత్తిదారులైన మన రైతులకు, చేతి వృత్తులవారికి మన సంఘజీవనంలోఉన్న ప్రధానపాత్రను - చివరకు వారి సాంఘిక జీవనాన్నికూడ - తప్పుడు దృక్పథంతో చూచి అంచనా వేస్తున్నారు. అందుచేతనే మన ప్రణాళికాసంఘం ఈ స్వయం కల్పితవృత్తి వ్యవస్థను వ్యక్తికరంగంలో (ప్రైవేటు) ఒక భాగంగా చేర్చింది.

ఈ స్వయం కల్పిత వృత్తిదారులు మన ఆర్థిక వ్యవస్థలో విశిష్ట స్థానాన్ని ఆక్రమించి ప్రధానపాత్ర వహిస్తున్నారు; అయినప్పటికి వీరిమనుగడకు ఆధారభూతమైన పునాదులను విశాలంచేసి బలపరచటంలో భారత ప్రభుత్వం ప్రత్యేకమైన శ్రద్ధ తీసికొని కృషిచేయవలసిన అవసరం లేదన్నట్లుగా

ప్రణాళికాసంఘం వ్యవహరిస్తున్నది. స్వయం కల్పిత వృత్తి దారులపట్ల ప్రణాళికాసంఘం వహిస్తున్న ఔదాసీన్యం వారి ప్రణాళికలు, సిఫారసులుచూస్తే స్పష్టపడుతుంది. పెద్ద పెద్ద పారిశ్రామికుల చేతులలో ఉన్న వారి వారి సొంత పారిశ్రామిక సంస్థల అభివృద్ధికి, వ్యక్తిక ప్రభుత్వ రంగాలలోని పారిశ్రామిక కూలీల స్థితిగతులను బాగుచేయటానికి మన ప్రణాళికాసంఘం కేటాయించిన ధనాన్ని చూచినప్పుడు వీరి నిర్లక్ష్యభావం మరింత రుజువు అవుతుంది. ప్రభుత్వ వ్యాపార పారిశ్రామిక సంస్థలలో పనిచేస్తున్నవారికి, ప్రభుత్వ కార్యాలయాలలోని ఉద్యోగుల వేతనాల అభివృద్ధికికూడ ప్రణాళికా సంఘం పెద్ద మొత్తాలను కేటాయించింది.

ఒక ప్రక్క కొందరి అభివృద్ధికి ఇంతటి ప్రాధాన్యం ఇస్తున్నప్పటికి దీనితో పోల్చి చూచినప్పుడు స్వయం కల్పిత వృత్తి దారుల పట్ల మన ప్రణాళికా సంఘ దృక్పథం కొన్ని సందర్భాలలో పట్టీపట్టనట్లుగా ఉంటున్నది; మరికొన్ని సందర్భాలలో పూర్తిగా విరుద్ధంగాకూడ ఉంటున్నది. రైతులు, చేతి వృత్తులవారు, చిన్నచిన్న దుకాణదారులు, చిల్లర వ్యాపారులు మొదలైన స్వయం కల్పిత వృత్తిదారులు కూడ వ్యక్తిక రంగంలో ఒక భాగమే అని ప్రణాళికాసంఘం భావిస్తున్నది. అందుచేతనే వీరి ప్రత్యేక రక్షణకు, ఈ వృత్తుల ప్రోత్సాహానికి శ్రద్ధ అవసరంలేదని తలపోస్తున్నది.

స్వయం కల్పిత వృత్తిదారులైన ఈ సామాన్య ప్రజలపై ప్రణాళికాసంఘం ప్రదర్శిస్తున్న వ్యతిరేక దృక్పథానికి ఒక

చిన్న దృష్టాంతం చూస్తే చాలు; వీరి నందరను దినభత్యంతో బ్రతికే కూలీలనుగా మార్చటానికి ప్రణాళికా సంఘం సిద్ధం అవుతున్నది. స్వయంకల్పిత వృత్తితో, గౌరవంతో, హోదాతో జీవిస్తున్న వీరిని దినభత్యపు కూలీలనుగా మార్చాలన్న ఈ ప్రయత్నం మూలంగా జాతికి ఎంతో నష్టం సంభవించింది; ఇంకా సంభవిస్తూనే ఉన్నది; జాతీయ సంపద, కృషి అభివృద్ధి నిరోధకాలైన విధ్వంసకర విధానాలలో వృథా అయిపోతున్నవి. సహకార వ్యవసాయ సంఘాల ద్వారా రైతులను దినభత్యపు కూలీలుగా మార్చాలని ప్రణాళికా సంఘం చేస్తున్న ప్రయత్నాలను ఈ సందర్భంలో ప్రత్యేకంగా చూపి చెప్పవలసి ఉన్నది. రైతులకు ఉన్న యాజమాన్యపు హోదాను అపహరించబోతున్నారు. ఇలా యాజమాన్యపు హోదాను అపహరిస్తూ ఓదార్పుకోసం సహకార వ్యవసాయ సంఘంలో రైతులకు కొన్ని వాటాలు ఇస్తారట! ఆ తరువాత క్రమంగా మామూలు పద్ధతులతో ఈ యాజమాన్యపు హోదాను పూర్తిగా హరించివేస్తారని ఎవరకు తెలియదు ? ఈ పరిణామం ఇలా క్రమంగా జరిగిన తరువాత భూములు లేని వ్యవసాయ కూలీలస్థితికి రైతులస్థితికి భేదం అణుమాత్రం కూడ ఉండదు. సహకార వ్యవసాయ విధానం వల్ల ఈ ప్రమాదం తప్పనిసరి కాగలదని హెచ్చరించక తప్పటం లేదు.

స్వయం కల్పితవృత్తి వ్యవస్థలోని విశిష్టతను, విలువను ప్రణాళికాసంఘం గుర్తించలేక పోవటంచేత, స్వయం కల్పిత వృత్తిదారులపట్ల ప్రణాళికాసంఘం నిర్లక్ష్య భావంతోను,

వ్యతిరేక దృక్పథంతోను వ్యవహరిస్తుండటంచేత మన ఆర్థిక వ్యవస్థను పునరాలోచించి నాలుగు రంగాలుగా విభజించాలని నేను కోరుతున్నాను. అవి (1) ప్రభుత్వరంగం (2) వ్యక్తిక కేపిటలిస్టురంగం (3) స్వయంకల్పిత వృత్తిదారుల రంగం (4) వీటికి సహాయ భూతంగా నిలబడే సహకారరంగం. మన దేశ వాస్తవ స్థితిగతులకు ఈ విభజన చాల సహజంగా, అనువుగా ఉంటుంది. ఈ విభజనవల్ల అసలు విషయాన్ని గురించి స్పష్టంగా ఆలోచించటానికి అవకాశం కలుగుతుంది. వివిధ రంగాల వాస్తవ విలువలను అంచనా కట్టటానికికూడ ఈ విభజన తోడ్పడుతుంది. వివిధ రంగాలకు సంబంధించిన సహకారసూత్రాలను రూపొందించటంలోను, వాటి ఆచరణకు మార్గాలు వేయటంలోను, వాటి కార్యకలాపాలను సమన్వయ పరచటంలోను కూడ ఈ విభజన సహాయకారి అవుతుంది.

## స్వయం కల్పిత వృత్తి వ్యవస్థ ప్రాధాన్యత

ప్రణాళికలు రెండు రకాలు; ఒకటి సంపూర్ణ ప్రణాళిక, రెండవది పాక్షిక ప్రణాళిక. సంపూర్ణ ప్రణాళికను రూపొందించాలంటె వ్యక్తిక రంగాన్ని ముందు పూర్తిగా నిర్బంధించటం అవసరం. ఇలాంటి సంపూర్ణ ప్రణాళిక నిర్బంధ పూరితమైన కేంద్రీకృత సంఘానికి దారితీస్తుంది. పాక్షిక ప్రణాళిక మిశ్రమ ఆర్థిక వ్యవస్థలో రూపొందుతుంది. ఈ పాక్షిక ప్రణాళికలో వ్యక్తిక కృషి పెంపొందుతుంది; ప్రభుత్వ సహాయం, సూచనలు, నియమ నిబంధనలు ఉన్నప్ప

టికి అవికూడ ఈ పెంపుదలకు సహాయకారులుగానే ఉంటవి. సంపూర్ణ ప్రణాళికకు సంబంధించిన ప్రతి పథకానికికూడ సంఘంలోని వారికందరకు పూర్తి వృత్తులను, పనిపాటలను చూపించటం ముందుగా నిర్వర్తించవలసిన ప్రధానకర్తవ్యం. ఈ సంపూర్ణ ప్రణాళికకు సంబంధించిన పథకాలలో ఆయా శ్రామికులకు, ఉద్యోగులకు ఎంత ప్రతిఫలం అందుతున్నది అనేది ప్రశ్నే కాదు. కార్మికులకు కేవలం బ్రతకటానికి కావలసిన ఆర్థిక సదుపాయం కలగ చేయటం వరకే ఈ సంపూర్ణ ప్రణాళిక కర్తవ్యం. అన్న వస్త్రాల కొఱత ఏర్పడి తత్ఫలితంగా ఆత్మవిశ్వాసం కోల్పోయే స్థితి కలగకుండ ప్రతి పౌరునికి ఏదో కొంత పనిని చూపించి తద్వారా ఆ ప్రమాదాన్ని నివారించటం సత్వరం చేయవలసిన పని.

పౌరుల కందరకు పూర్తి పనిపాటలను చూపించే బాధ్యతను పాక్షిక ప్రణాళిక తీసికోదు. పౌరులు కరువు కాటకాలకు గురై ఆత్మవిశ్వాసం కోల్పోయేస్థితి కలగకుండ చేయటానికి ఈ పాక్షిక ప్రణాళిక అనుశ్రుతంగా వస్తున్న సాంఘిక ఆర్థిక సంస్థలమీద, సంప్రదాయాలమీద ఆధారపడుతుంది. ఈ 'పాక్షిక' ప్రణాళిక తనకున్న పరిమితమైన సాధన సంపత్తులను ప్రాథమికమైన ప్రధాన అభివృద్ధి కార్యకలాపాలకు మాత్రమే వినియోగిస్తుంటుంది. భారతదేశంలో మూడుకోట్లకు పైగా నిరుద్యోగులు ఉన్నారని మనకు తెలిసిన విషయమె. దేశంలో విధ్వంసకర విప్లవాన్ని లేపాలంటె ఈ బలగం చాలు. దేశంలో ప్రాథమికాభివృద్ధి జరగని పక్షంలో దేశవ్యాప్తంగా ప్రజలలో ఆత్మవిశ్వాసం, ధైర్యం నశించి

తత్ఫలితంగా సాంఘిక జీవనం విధ్వంసమై, నైతిక విలువలు చెల్లాచెదరు కాగల ప్రమాదంకూడ ఉన్నది. కాని ఆశ్చర్యమేమంటే ఇంతమంది నిరుద్యోగులు ఉన్నప్పటికి భారతదేశం ఇంతవరకు ఈ ప్రమాదాలు జరగకుండ తప్పుకొని పోతూనే ఉన్నది. ఈ ప్రమాదాలను నివారించటానికి ప్రణాళికాసంఘం ఏదో చేసిందనుకోవటం పొరపాటు. ఈ విషయంలో ప్రణాళికాసంఘం చేసిన కృషి ఈషణ్మాత్రంకూడ లేదు. నిరుద్యోగుల బాధలను, అవసరాలను తీర్చటానికి ప్రణాళికా సంఘం చేసింది ఏమీ లేదు.

ఈ ప్రమాదాలు జరగకుండ మన సాంఘిక ఆర్థికవ్యవస్థలు కాపాడుతున్నవి గదా! మరి దీనికి కారణం ఏమిటి? మన సంఘ ఆర్థిక వ్యవస్థ ఈ ప్రమాదాలను ఎలా నివారింపగలుగుతున్నది? ఇంతమంది నిరుద్యోగులు ఉన్నప్పటికి దేశంలో శాంతి నెలకొల్పటంలోను, నిరుద్యోగులు సహనంతో, ఓర్మి వహించటంలోను మన స్వయంకల్పిత వృత్తి వ్యవస్థ చేస్తున్న సేవకు సంఘం కృతజ్ఞతా బద్ధమై ఉండక తప్పదు. స్వయం కల్పితవృత్తి విధానం ఇంచుమించు తన సభ్యులకందరకు కొద్దో గొప్పో ఏదో కొంత పనిని చూపిస్తున్నది; తద్వారా ఆ కుటుంబాలు జీవనం వెళ్ళబోస్తున్నవి. ఈ కుటుంబాలన్ని ఇంచుమించు ఉమ్మడి కుటుంబాలే. కాబట్టి కుటుంబయజమాని తెచ్చే కొద్దిపాటి సంపాదనతో ఆ కుటుంబంలోని అనేకులు—పనిపాటలు చేసే వయస్సువచ్చినవారితో సహా—ఏదో ఒకవిధంగా సర్దుకొని బ్రతుకుతున్నారు. దేశంలో నిరుద్యోగం ఇంతగా ప్రబలినప్పటికి శాంతి భద్రతలు, నైతిక

విలువలు తలక్రిందులు కాకుండ యథాతథంగా కొనసాగు తూనే ఉన్నవి. కుటుంబ సభ్యులమధ్య ఉండే సంబంధ బాంధ వ్యాలు, కుటుంబ గౌరవంపట్ల వారికి గల ఆదరణ మాత్రమే దీనికి కారణాలు. కుటుంబ గౌరవ ప్రతిష్ఠలు కారణంగా విధింపబడే నిర్బంధాలచేత, కాస్తోకూస్తో సంపాదించే కుటుంబ యజమాని తన ఇంటిలోని నిరుద్యోగులపై తగిన అధికారం వహించి వారి జీవితాలను ఒకదారిలో పెడుతున్నాడు. అందుచేతనే మన సంఘంలోని నిరుద్యోగులు దురభ్యాసా లకు, నేరాలకు దూరంగా ఉండగలుగు తున్నారు.

నిరుద్యోగం కారణంగా సంభవించే ప్రమాదాలు ఇలా అరికట్టబడుతున్నవి. నిరంతర నిరుద్యోగ ఫలితంగా సామా న్యంగా సంభవించె బాధలను, అవినీతిని, ఆత్మవిశ్వాస రాహి త్యాన్ని తొలగించటంలో మన స్వయంకల్పిత వృత్తి వ్యవస్థ ఇలా తోడ్పడు తున్నది.

కాబట్టి ఈ స్వయంకల్పిత వృత్తిదారులు పనిపాటలను సంపాదించుకోవటానికి తమంతతామే వీరోచితంగా ప్రయ త్నిస్తూ, జాతీయోత్పత్తిని అధికం చేయటానికి తోడ్పడు తున్నారు. ఇలాంటి మనరైతులు ప్రస్తుతం అనుభవిస్తున్న స్వయంకల్పిత వృత్తిహోదాను, స్వయంపోషకత్వాన్ని, తమ తమ కుటుంబాల పనిపాటల బాధ్యతను, కుటుంబపోషణా భారాన్ని, సాంఘిక క్రమశిక్షణ బాధ్యతను వదులుకొనవలసి వస్తే - సహకారవ్యవసాయంవల్ల ఇది తప్పనిసరి - ఈ అన్ని బాధ్యతలను మనప్రణాళికాకారులే స్వీకరించవలసి ఉంటుంది.

నిరుద్యోగు లందరకు పనిపాటలు చూపి, సంఘంలో శాంతిని కాపాడి, సంఘీయులలో ఆత్మవిశ్వాసాన్ని నిలిపి, సంఘ జీవితం సక్రమంగా సాగేటట్లు చేయవలసిన బాధ్యత ప్రణా ళికాకారులమీద పడుతుంది. ప్రస్తుత స్థితిగతులలో ఈ బాధ్య తను వారు స్వీకరించలేరని, స్వీకరించినా నిర్వహించలేరని తేలికగా చెప్పవచ్చు. ప్రస్తుతం స్వయంకల్పిత వృత్తిదారు లుగ ఉన్నవారి కందరకు ప్రభుత్వమె వృత్తులను చూప వలసి ఉంటుంది. ఈ స్వయం కల్పిత వృత్తిదారుల కందరకు ప్రభుత్వమె శిక్షణ గఱపించి వారి పోషణ విషయమై బాధ్యత వహించవలసి ఉంటుంది. వీరి కందరకు నిరుద్యోగ నివారణకు కొంత సాయం చేయాలి; వీరి సాంఘిక భద్రతకు తోడ్పడాలి; పనిపాటల ప్రతిఫలానికికూడ ప్రభుత్వమే బాధ్యత వహించవలసి వస్తుంది. ఇదంతా చేయాలంటే ప్రభుత్వానికి తలకుమించిన బరువు అవుతుంది.

ఒకవేళ ఈ పనులను చేయాలన్నప్పటికి అది నియం తృత్వ ప్రభుత్వానికే సాధ్యపడుతుంది. నియంతృత్వం అంటే ఏమిటో, దాని కార్య విధానాలు, నిర్దాక్షిణ్య పద్ధతులు ఎంత ప్రమాద భరితమైనవో మనకు తెలియనిది కాదు; ఇలాంటి నియంతృత్వం మనకు అవసరంలేదు; అసలు మనదేశ పరి స్థితులలో దానిని గురించి ఆలోచించే అవకాశంకూడ లేదు. ప్రభుత్వము, ప్రణాళికాకారులు ఈ బాధ్యతలు స్వీకరింపవల సిన అవసరం లేకుండా మన రైతాంగ ఆర్థిక వ్యవస్థ కాపాడు తున్నది. ప్రభుత్వంపై ప్రణాళికాకారులపై భారంమోపక తన విషయమై తానే బాధ్యతాయుతంగా వ్యవహరిస్తున్నది.

స్వయంకల్పిత వృత్తిదారులు ప్రజాస్వామిక బద్ధమైన ప్రణాళికల విజయానికి తోడ్పడటమేకాక, క్రమబద్ధమైన సంఘంలో ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించటానికికూడ ఎంతో సేవచేస్తారు. సమగ్ర ప్రజాస్వామ్యంతో, స్వేచ్ఛాపూరితమైన సంఘం విలసిల్లటానికి వీరిస్వయంకల్పిత వృత్తిరంగమే ఉత్తమ మార్గంగా, రక్షణగా ఉండగలదు.

ప్రణాళికా బద్ధమైన,ప్రజాస్వామిక పూరితమైన సంఘం ద్వారా దేశంలోని దోపిడి విధానాలను, ఆచారాలను, సంస్థలను రూపుమాపి తద్ద్వారా సాంఘిక న్యాయాన్ని, సామ్యవాదాన్ని స్థాపించటం మన ఆశయమయిన పక్షంలో దానికి మనరైతుకంటె, స్వయంకల్పిత వృత్తివ్యవస్థకంటె మించిన మార్గం మరొకటి ఉండబోదు. మనం ఆశించే ప్రజాస్వామిక బద్ధమైన సోషలిస్టు సంఘాన్ని స్థాపించటానికి మన సంఘం — రైతులతో, ఇతర చేతివృత్తులవారితో క్లుప్తంగా చెప్పాలంటే స్వయంకల్పితవృత్తిదారులతో కూడిన మన సంఘమే తగిన మార్గం చూపగలదనటంలో ఎట్టి సందేహంలేదు.

రైతాంగంపట్ల తాము అవలంబిస్తున్న వైఖరికి సమాధానం చెప్పుకోవటం కోసమని 'రైతులు కేపిటలిస్టు వ్యవస్థ చిహ్నా'లన్న లెనినిస్టు పాక్షిక దృక్పథాన్ని అంగీకరించటం మన ప్రణాళికాకారులకు తగనిపని. రైతులు దోపిడికి దూరంగా ఉండే ప్రజలు. శరీర శ్రమతో జీవించె శ్రామికులు కూడ ఈ రైతుల వంటివారే. మేధావులకు, వర్తక వాణిజ్యాదులలోని పారిశ్రామికులకు ప్రాధాన్యం ఇచ్చి ఈ శ్రామికు

లను తక్కువచూపు చూడటంకూడ ప్రణాళికాసంఘానికి తగనిపనే. స్వయంకల్పిత వృత్తితో జీవిస్తున్న రైతులకు, ఇతర చేతివృత్తుల వారికి ఈ శ్రామికులు అడ్డురారు. పరుల పెత్తనానికి లోబడకుండ స్వేచ్ఛగా జీవించగల అవకాశాలను అందించే సోషలిస్టు సంఘంలో వీరందరు బలపడటం అవసరం.

మన సంఘంలో ఈ స్వయం కల్పితవృత్తి దారులు చాల ప్రధానమైన, ఆవశ్యకమైన పాత్ర నిర్వహిస్తున్నారు. వికేంద్రీకృతమైన బహుళార్థ సాధక సాంఘిక ఆర్థిక సంఘాలు మన సమాజంలో వీరే. మనం ఆశిస్తున్న సోషలిస్టు సమాజ నిర్మాణంలో వికేంద్రీకృత బహుళార్థ సాధక సంఘాలుగా కృషి చేయటానికి ఈ స్వయం కల్పిత వృత్తిదారులు ఎంతగానో తోడ్పడతారు. ప్రణాళికాబద్ధమైన ఆర్థిక వ్యవస్థ కావలసింది కూడ వీరికే. సోషలిస్టు ప్రణాళికాబద్ధమైన ఆర్థిక వ్యవస్థలో వీరు ప్రజాస్వామిక సూత్రాల రీత్యా ఏర్పడిన సంఘాలని గుర్తించాలి. ప్రజాస్వామ్యానికి, సోషలిజానికి ఈ స్వయం కల్పిత వృత్తిదారులే ఆయువు పట్టుగా, పునాదులుగా ఉండి పాటుపడగలరు.

స్వయం కల్పిత వృత్తి వ్యవస్థలో ఇవేకాక ఇంక అనేకమైన ఇతర ప్రయోజనాలుకూడ ఉన్నవి. క్రమబద్ధమైన సంఘంలో ప్రజాస్వామిక వాతావరణాన్ని, సూత్రాలను నిలిపి బలపరచటంలో వీరు చాల ఉపయోగపడతారని ఈ సందర్భంలో ముఖ్యంగా చెప్పవలసి ఉన్నది. ఈ స్వయం కల్పిత వృత్తి వ్యవస్థలో దోపిడిని సాధ్యమైనంతవరకు తగ్గించి వేసే

వీలున్నది. మన దేశంలో ఈ నాడు మనం శతధా అవసరం అని చెప్పుకొంటున్న పారిశ్రామిక రంగ వికేంద్రీకరణ ఈ స్వయం కల్పితవృత్తి వ్యవస్థకు సహజలక్షణం. ఆధునిక ఆర్థిక శాస్త్ర సిద్ధాంతాలు అత్యంత విలువతో పరిగణిస్తున్న ప్రణాళికలు, సహకారం అనే రెండు అంశాలు ఈ స్వయం కల్పిత వృత్తి వ్యవస్థ అనే రథానికి రెండు చక్రాలవంటివి. ఈ స్వయం కల్పిత వృత్తిదారులు మన సంఘ ఆర్థిక వ్యవస్థను అభివృద్ధి చేయటంలో చేస్తున్న కృషిని ప్రణాళికాకారులు ఏ మాత్రం గుర్తించక పోవటం మాత్రం చాల శోచనీయమైన విషయం.

## స్వయం కల్పిత వృత్తి వ్యవస్థ :<br>వ్యక్తిక కేపిటలిస్టు రంగం

వ్యక్తిక కేపిటలిస్టు రంగం గురించి మన ప్రణాళికా సంఘం తీసికొంటున్న దృక్పథం, అవలంబిస్తున్న విధానాలు స్వయం కల్పితవృత్తి దారులపట్ల ఏ మాత్రం తగవని గమనించ వలసి ఉన్నది. ఇప్పటికె చాల ఆలస్యమయినప్పటికి ఇకనైనా ఈ గమనింపు అవసరం. ఈ మాట అంటున్నామంటే దీనికి కారణం ఉన్నది. కేవలం స్వలాభాపేక్షతో కార్యరంగంలోకి దూకే కొద్దిమంది పారిశ్రామికుల అనంతమైన స్వేచ్ఛకు భద్రత కలిపించటం, ఆ సంస్థలలోని అసంఖ్యాక ప్రజలకు ఈ స్వేచ్ఛను నిరాకరించటం కేపిటలిజానికి ప్రత్యేక లక్షణం. కాని స్వయం కల్పిత వృత్తి వ్యవస్థ ఇందుకు భిన్నంగా ఉంటుంది. ఈ వ్యవస్థలోని సభ్యుల కందరకు ఇలాంటి స్వేచ్ఛ ఉంటుంది; ఆ స్వేచ్ఛకు భద్రతకూడ ఉన్నది. వీరికి సహజ

మైన ఉత్సాహ ప్రోత్సాహాలు, ఆత్మగౌరవం ఉంటవి. ఆర్థికాధికారం కొద్దిమంది చేతులలో కేంద్రీకృతం కావటానికి కేపిటలిజం దారితీస్తుంది. కాని స్వయం కల్పిత వృత్తి వ్యవస్థ ఇందుకు భిన్నంగా ఈ ఆర్థికాధికారాన్ని సాధ్యమైనంత ఎక్కువ మందికి పంచుతుంది. సాంఘికంగాగాని, ఆర్థికంగా గాని లేక రాజకీయంగాగాని సంఘంలో ఉండే అధికారానికి ఒక ప్రత్యేక లక్షణం ఉన్నది. అధికారం కొద్దిమంది చేతులలో కేంద్రీకృతమైనప్పుడు తత్ఫలితంగా ఆ అధికారులలో అహంకారం ప్రబలి, బాధ్యతా రహితంగా ప్రవర్తించటం అలవడి, నియంతృత్వానికి బాటలు పడతవి. ఇలా కాక అధికారం వికేంద్రీకృతమై ప్రజల చేతులలోనికి పోయిననాడు సంఘానికి అది ప్రయోజనకారి అవుతుంది.

పెద్ద పెద్ద పారిశ్రామిక వ్యాపార సంస్థలలో తమకుగల వాటాలమీద, ఇతర ఆస్తులమీద ఎలాంటి పరిమితులు పెట్టనీయకుండ కేపిటలిస్టులు ప్రభుత్వాన్ని ఇంతవరకు ఆపుతూనే ఉన్నారు. కాని స్వయం కల్పిత వృత్తి వ్యవస్థలోని అధిక సంఖ్యాకవర్గమైన రైతులు మాత్రం తమ భూవసతులకు గరిష్ఠ పరిమితులు విధించే సూత్రాన్ని ఆమోదించారు. ఇతర రంగాలలోని పలువిధాలైన ఆస్తులమీద, ఆదాయాలమీద కూడ ఇలాంటి పరిమితులను విధించాలని రైతులు కోరుతున్నారు; కాని ఇంతవరకు ఎలాంటి ప్రయోజనం కనిపించలేదు. ప్రభుత్వంతో పోటీపడి ప్రభుత్వరంగాన్ని తమకు దూరంగా ఉంచగలశక్తి కేపిటలిస్టులకు ఉన్నది. స్వయం కల్పిత వృత్తిదారులైన రైతులకు, కేపిటలిస్టులకు వారి వారి

దృక్పథాలలోనే చాల తేడాలున్నవి. రైతులు తమ వ్యావసాయకోత్పత్తులకు కనీసపు గిట్టుబాటు ధరలు లేక పోయినా ఎంతో ఔదార్యంతో, త్యాగంతో ఆ కొద్దిపాటి ధరలకే అంగీకరించారు. కాని ఇతర పారిశ్రామికులు తమ పారిశ్రామికోత్పత్తులకు అధికమైన ధరలు కావాలని ప్రయత్నించి సఫలీకృతులైనారు. కాబట్టి గిట్టుబాటు ధరలు లేకపోయినా ప్రజా సేవానురక్తితో వాటిని అంగీకరించిన మన రైతులకు, స్వలాభాపేక్షతో తమ వస్తువుల ధరలను అనంతంగా పెంచివేసిన కేపిటలిస్టులకు ఎంత అంతరం ఉన్నదో ఆలోచించండి. జాతికి కావలసిన ఆహారాన్ని అందించవలసిన బాధ్యత ప్రభుత్వానిది. చౌకగా ఆహారాన్ని అందించటంలో తమ కెన్ని కష్ట నష్టాలు ఉన్నప్పటికీ రైతులు ప్రభుత్వంతో హృదయపూర్వకంగా సహకరించారుగదా! దేశము, జాతి క్లిష్ట పరిస్థితులలో ఉన్న సమయంలో స్వార్థప్రేరితులైన కేపిటలిస్టులు ఏమి చేశారో అందరకు తెలిసిన విషయమె; మనకు ఉన్న కొద్దిపాటి విదేశీ మారక ద్రవ్యాన్ని అనేక విధాల దొంగ చాటుగా ఇష్టం వచ్చినట్లు వినియోగించి ప్రభుత్వ కృషిని విఫలంచేసి ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టారు. మన ప్రభుత్వాశయమైన సోషలిస్టుపద్ధతి సమాజ సిద్ధాంతంలో అంతర్భాగాలైన ఉత్పత్తి విధానాలను, వినిమయమార్గాలను వ్యాపార పారిశ్రామికాధినేతలు తలక్రిందులుచేసి చిక్కులు కలిగించారు. అందుచేత స్వయం కల్పిత వృత్తి వ్యవస్థకు, వ్యక్తిక కేపిటలిస్టు రంగానికి ఎంతో భేదం ఉన్నది. ఇవి రెండు ఒకే రంగానికి సంబంధించిన వనుకోవటం పొరపాటు. ఈ రెండు

రంగాలు భిన్న భిన్న వ్యవస్థలని గమనించాలి. వీటిరెంటికి సంబంధించిన విధానాలలోను, దృక్పథాలలోను ఆ తేడా కనిపించాలి; వీటిరెంటిని విడిగా, దేనికి దానినిగా చూడాలిగాని కలిపి చూడరాదు.

ఈ స్వయం కల్పిత వృత్తిదారులను కేపిటలిస్టులకు భిన్నంగా, విడిగా చూడ నిరాకరించిన పక్షంలో జాతికి ఎంతటి నష్టం సంభవించగలదో మన ప్రణాళికా కారులు గమనించాలి. రైతుల స్వయంకల్పిత వృత్తిహోదాను, ఆర్థిక వ్యవస్థను ఛిన్నాభిన్నం చేసి తలక్రిందులు చేయగల ప్రణాళికల మూలంగా ఎంతటి అరిష్టం కలగ నున్నదో ప్రణాళికాసంఘం గుర్తించాలి. స్వతంత్ర జీవులైన రైతులను అటులాగి ఇటులాగి కేపిటలిస్టులుగానో లేక కూలీలుగానో చేయ ప్రయత్నించితే ఆ ప్రయత్నం తప్పక విఫలంకాగలదని ప్రణాళికా కారులు గ్రహించాలి. సరిగా అభివృద్ధి చెందీచెందని దేశాలలో రైతులను స్నేహితులుగా గుర్తించి, వారిపట్ల విశ్వాసం ప్రదర్శించి, వారి సహాయ సానుభూతులను పొందటం దేశానికి ఎంతో అవసరం; లాభదాయకం. ఎవరెన్ని చెప్పినా ప్రజాస్వామిక సంఘంలో నిజమైన సోషలిజానికి లక్షణం ఏమిటి? వికేంద్రీకరణేకదా! దేశంలోని సంపద, అధికారం, ఉత్పత్తి సాధనాలు, సంఘాలు సాధ్యమైనంతవరకు వికేంద్రీకరింపబడటమే కదా ప్రజాస్వామిక సోషలిజానికి లక్షణం! మన రైతులు, చేతివృత్తులవారు, కళాకారులు ఈ వికేంద్రీకరణకు పునాదులు. ఈ విషయంలో భారతదేశపు అదృష్టాన్ని కొని యాడవలసి ఉన్నది. పాశ్చాత్యుల పారిశ్రామిక

సామ్రాజ్యవాదం రెండు శతాబ్దాలపాటు భారతదేశాన్ని పీడించివదలినప్పటికి ఉత్పత్తి సాధనాలు దేశవ్యాప్తంగా వికేంద్రీకృతమై ఉన్న మన రైతాంగ ఆర్థికవ్యవస్థమాత్రం చెక్కుచెదరకుండ నిలిచి ఉండటం ఆశ్చర్యకరమైన విషయం; అభినందించుకొనవలసిన సంగతి. ఈ వికేంద్రీకృత కూడలులు (అంటే రైతుకుటుంబాలు) మన సంఘ ఆర్థిక వ్యవస్థకు ఈ నాటి వరకు పునాదులుగా ఉండగలగటం సంతోషించవలసిన విషయం. ఏమైనప్పటికి శతాబ్దుల తరబడి విస్మరింపబడి నిర్లక్ష్యం చేయబడుతున్న ఈ రైతు కుటుంబాలకు ఇప్పటికైనా, నేటి ప్రణాళికాబద్ధమైన ఆర్థిక వ్యవస్థలోనైనా వెంటనే తగిన సహాయం చేయటం మన ప్రథమ కర్తవ్యం. ఈ రైతులకృషిని సహకారపూర్వకంగా సమన్వయ పరచటం, వీరికి కావలసిన ఋణ సౌకర్యాలు ఏర్పాటుచేయటం, వీరి ఉత్పత్తి కార్యకలాపాలకు కావలసిన ఇతరపనిముట్లను, వస్తువులను వెంటనే అందించటం మొదలైన సహాయాలు జరగవలసి ఉన్నవి. వీటి నన్నింటిని సాధించటానికి సహకార సంఘాలు కావాలి. సహకార సమన్వయాలతో సామరస్యపూరితంగా విలసిల్లగల సాంఘిక స్థితిగతులు ఏర్పాటు కావాలి, రైతాంగానికి ఈ భద్రతలు కలిగించాలి.

ఈ స్వయంకల్పిత వృత్తి వ్యవస్థకు కావలసిన ధనం, ఇతర సహాయాలు వాస్తవానికి అంతపెద్ద వేమీకాదు. దేశంలోని పారిశ్రామికాది ఇతర రంగాల అవసరాలతో పోల్చి చూచినప్పుడు ఈ మాట నిర్భయంగా చెప్పవచ్చు. అంతేకాక ఈ రంగానికి అందించే సహాయం ఎంతో పొదుపుగా, సక్రమంగా,

సమగ్రంగా వినియోగించబడి మంచి లాభాలు వస్తాయనటంలో కూడ ఎట్టి సందేహం ఉండనవసరంలేదు. ఇతర రంగాలకు కావలసిన సహాయాన్ని అందించటంలో మోయవలసినంతటి భారం దీనిని గురించి ప్రభుత్వానికి ఉండదు. ఈ స్వయం కల్పిత వృత్తి వ్యవస్థపట్ల స్నేహపూర్వక దృక్పథం వహించిన పక్షంలో ఈ వ్యవస్థ రక్షణకు, అభివృద్ధికి వినియోగించబడే ప్రతి పైస కూడ పెద్ద ఎత్తున అధికోత్పత్తి సాధనకు ఉపయోగ పడి మంచి ఫలితాలను ఇయ్యగలదని ప్రణాళికాకారులు గ్రహించగలరు.

## స్వయంకల్పిత వృత్తిదారులపట్ల ప్రభుత్వ బాధ్యత

మన జాతీయ జీవితంలో ఈ స్వయంకల్పిత వృత్తి వ్యవస్థ చాల ప్రముఖమైన భాగమని, ఇది శాశ్వతమైన భాగమని ప్రభుత్వం గుర్తించి అంగీకరించాలి. స్వయంకల్పిత వృత్తిదారుల ఉత్పత్తి విధానాలను ఆధునికీకరణ కావించ టానికి ప్రభుత్వం తగిన చర్యలు తీసికోవాలి. వీరి సాంకేతిక సామర్థ్యాన్ని, సాంస్కృతిక స్థితిగతులను అభివృద్ధి చేయ టానికి వెంటనే ప్రయత్నాలు ప్రారంభం కావాలి.

ముఖ్యంగా భూమి ఎత్తుపడిపోకుండ చేయటంలోను, భూసారాన్ని పెంపొందించటంలోను కనుగొనబడిన శాస్త్రీయ పరిశోధనలను వెంటనే అమలులోనికి తీసికొనివచ్చి రైతులకు నేర్పటం అవసరం. నీటిసౌకర్యాల ఏర్పాటును గురించి, పంటకాల్వల తీరుతీయాలని గురించి వచ్చిన ఆధునిక పద్ధతు లను వెంటనే నెలకొల్పాలి. ఆధునిక వ్యవసాయ విధానా

లను అమలులో పెట్టటానికి తగినంత విస్తారంగా పెద్దఎత్తున నీటి పారుదల సౌకర్యాలు కలిగించటంకూడ అవసరం. శాస్త్రీయంగా పరిశోధించబడిన మంచిమంచి విత్తనాలు అదనుకి అన్నిస్థలాలలోను చౌకగా అందేటట్లు చేయాలి.

ఈ స్వయంకల్పిత వృత్తిదారులందరు ఇంచుమించు గ్రామీణ ప్రాంతాలలోనే నివసిస్తూ ఉంటారు. కనుక వీరి ఆర్థిక సాంస్కృతిక స్థాయిని అభివృద్ధి చేయుటానికి కావలసిన సాంఘిక వాతావరణం కలిగించటానికి ప్రభుత్వం వెంటనే పూనుకోవాలి. ఉదాహరణకు గ్రామాలలో మంచి దుకాణాలను నెలకొల్పాలి; గోడ్లను వేయాలి; రవాణాకు ఉపకరించే కాల్వలను ఏర్పరచాలి; రైలుమార్గాల శాఖలను విస్తరింప చేయాలి. ఇంతేగాక గ్రామాలలో బ్యాంకులు, తపాలా కార్యాలయాలు, గ్రంథాలయాలు, పాఠశాలలు, వైద్యశాలలు, పరిశోధనశాలలు నెలకొల్పాలి. గ్రామాలలో ముఖ్యంగా కావలసిన వాటిలో ఋణం ప్రధానమైనది. ఈ ఋణసౌకర్యం కలిగించటానికి ముఖ్యంగా సహకార ఋణ సౌకర్యాలు ఏర్పాటు చేయాలి. గ్రామీణ ప్రజలకు కావలసిన నిత్యజీవితావసర వస్తువులను, ఇతర పరికరాలను అందించటం కోసం కో-ఆపరేటివ్ స్టోర్స్‌లను ఏర్పాటు చేయాలి.

గ్రామాలలో ఏర్పరచే బహుళార్థ సాధక గ్రామీణ సహకార సంఘాలు చేయవలసిన పనులు చాలఉన్నవి. గిడ్డంగులు, దుకాణాలు, ఆహార పదార్థాలను తయారుచేసే కేంద్రాలు మొదలైనవాటిని నిర్మించవలసి ఉండటంచేత మరి

రెండు పంచవర్ష ప్రణాళికల వరకు కూడ ఇవి గ్రామాలలోని రైతులకు, ఇతరచేతివృత్తులవారికి అవసరమయ్యే ఋణంలో సగం మాత్రమే అందించగలవు. అందుచేత ఆ మిగిలినసగం కోసం స్వయంకల్పిత వృత్తిదారులు కేపిటలిస్టు ఋణదాతల మీదనే ఆధారపడవలసి ఉంటుంది. కాబట్టి ఋణదాతల చర్యలపై తగిన నియమ నిబంధనలు ఉంచటంకోసం ఋణ దాతలను క్రమబద్ధంచేసేచట్టం ఒకదానిని తీసికొని రావలసి ఉంటుంది. ఒకప్రక్క ఋణదాతలకు మరొకప్రక్క చిల్లర దుకాణదారులకు రిజర్వుబ్యాంకు, స్టేట్ బ్యాంకు కొంత ధన సహాయం చేయవలసి ఉంటుంది. ఆ యా వ్యక్తులవద్ద ఉండే సరకుల హామీమీదగాని, ఇతర హామీలమీదగాని ఈ ధన సహాయం చేయవలసి ఉంటుంది.

స్వయంకల్పిత వృత్తిదారులకు వారి ప్రధాన వృత్తుల ద్వారా, తత్సంబంధమైన ఇతర అనుబంధ వృత్తులద్వారా సంవత్సరంలో ఎంతకాలం పనిపాటలు దొరుకుతున్నవో తెలిసికోవటానికి తగిన లెక్కలను అప్పుడప్పుడు సేకరిస్తు ఉండాలి. కనీసం మూడు సంవత్సరాలకు ఒకమారైనా ఈ లెక్కల సేకరణ జరగాలి. ఈ లెక్కలు ప్రతిగ్రామంలోని ప్రజలకుకూడ తెలియజేయబడుతు ఉండాలి. జీవితరంగంలో ప్రవేశించనున్న యువకులకు, వారి తలదండ్రులకు ఈలెక్కలు ముఖ్యంగా అందుబాటులో ఉండాలి. ఈ వివరాలు ఈకొత్త వారికి ఎంతగానో తోడ్పడుతవి.

నిత్యజీవితావసర వస్తువుల ఉత్పత్తివ్యయం ఎంతెంతగా ఉన్నదో తెలియచేసే వివరాలను, జీవన వ్యయానికి సంబం

ధించిన వివరాలను ఎప్పటికప్పుడు తీసికొంటు ఉండాలి. ఇలా జీవితావసర వస్తువుల వ్యయానికి, జీవనవ్యయానికి సంబంధించిన లెక్కలనుబట్టి తదను గుణంగా ప్రభుత్వ విధానాలు ఎప్పటికప్పుడు సవరింపబడుతు ఉండాలి.

గ్రామీణ ప్రజలకు కావలసిన గృహావసతిని గురించి సరైన అంచనాలు తయారు చేయాలి. వ్యవసాయ కూలీలకు, ఇతర చేతివృత్తుల వారికి, రైతులకు కావలసిన వివిధ గృహాల నమూనా పథకాలను – వారివారి అవసరాలనుబట్టి – సిద్ధం చేయాలి. రైతులకు కావలసిన పశువులశాలలు, బ్యారెన్లు మొదలైనవాటిని గురించికూడ సరైన లెక్కలు తయారు చేయాలి. ఆయా రైతులకు కావలసిన ఋణసౌకర్యాలు, ఇతర వస్తువుల అవసరాలు సరిగా అంచనావేసి అందించటానికి ఈ లెక్కలు, అంచనాలు ఉపయోగపడతవి. ఆ ఉద్దేశం తోనే ఈ అంచనాలు జరగాలి.

ఇవికాక మన పంచవర్ష ప్రణాళికలలో సూచింపబడిన ఇతర సహాయాలుకూడ మరింతగా అందించాలి. స్వయం కల్పిత వృత్తిదారులకు ఈనాటి అవసరాలకు సరిపోయే టంతగా ఈ సహాయ కార్యక్రమాలు జరగాలి. మన ప్రణాళికాకారులు స్వయం కల్పిత వృత్తిదారులకు ఇదివరకే కొంత సహాయం చేశారు; కాని అది చాల కొద్ది. అయినప్పటికి ఆ కొద్దిపాటి సహాయంతోనే వీరు చాల అభివృద్ధి సాధించారు. మన ప్రణాళికాసంఘంవారు ఈ విషయమై ఇదివరలో అవలంబించిన నిర్లక్ష్య వైఖరిని ఇకనైనా సవరించుకోవటం అవసరం.

# గ్రామీణ పరిశ్రమలు

స్వయం కల్పితవృత్తి వ్యవస్థలోని ప్రజలకు ప్రధానమైన రెండు సమస్యలు ఎప్పటి కప్పుడు అధికమవుతూ ఎదురవుతున్నవి. నిత్యము కష్టించి శ్రమించె ఈ ప్రజల జీవన ప్రమాణం పెంచటం ఒక సమస్య. ప్రతిసంవత్సరం ఈ రంగం లోనికి అధికంగా, నూతనంగా వచ్చే యువకులకు పనిపాటలను చూపించటం రెండవ సమస్య. ఈ సమస్యల పరిష్కారానికి కొన్ని మార్గాలు ఉన్నవి. వ్యవసాయోత్పత్తులను కార్య కలాపాలను విస్తృతంచేయాలి. వ్యవసాయోత్పత్తులకు సంబంధించిన పరిశ్రమలను ఏర్పాటు చేయాలి. కొన్ని కొన్ని పరిశ్రమలను గ్రామీణ ప్రాంతాలకు ప్రత్యేకించాలి. ఇలా చేస్తే ఈ సమస్యల పరిష్కారం తేలికే. చెట్లపెంపకం, పట్టుపురుగుల పెంపకం, కూరగాయలపెంపకం, ఇతర ఫలవృక్షాల పెంపకం మొదలైన వాటిని అభివృద్ధిచేసికొని వ్యవసాయ కార్య కలాపాలను, ఆదాయాన్ని పెంపొందించుకొనవచ్చు. పశు విస్తరణ పథకాలు, పాడిపరిశ్రమ, తేనెటీగలపెంపకం, ఆహార పదార్థాలను తయారు చేయటం ఈ మొదలైనవి వ్యవసాయానికి సంబంధించిన పరిశ్రమలకు కొన్ని ఉదాహరణలు. ఇక ఈ స్వయం కల్పితవృత్తి వ్యవస్థకు ప్రత్యేకించవలసిన పరిశ్రమలను గురించి, వాటి వివరాలను గురించి ఆలోచించటం కోసం ఒక సంఘాన్ని నియమించటం అవసరం. ఈ పనులు చేసిన పక్షంలో స్వయం కల్పితవృత్తి రంగంలోని వారికి పని పాటలకు కొదవ ఉండదు. ఆదాయానికికూడ మార్గాలు ఏర్పడతవి.

ఈ పైన చెప్పిన కార్యకలాపాలవల్ల ఎట్టి ప్రయోజనాలు సిద్ధించగలవో సూచించటానికి ఆహారపదార్థాలను తయారుచేసే కేంద్రాలను, గుడ్డలపరిశ్రమను గురించి ఉదాహరిస్తాను. ఈ ఉదాహరణవల్ల స్వయం కల్పిత వృత్తిదారుల ఆదాయానికి ఇవి ఎంతగా తోడ్పడగలవో తెలుస్తుంది. ఆహారపదార్థాలను కొనుక్కొనేవారు చెల్లిస్తున్న మూల్యంలో నూటికి 40 వంతులు ఆ పదార్థాలను తయారుచేసేవారికి పోతున్నదని పాశ్చాత్య దేశాలలో అంచనా వేశారు. కాబట్టి ఈ పరిశ్రమను బాగా పెంపొందించిన పక్షంలో దీనివల్ల గ్రామీణ ప్రజల ఆదాయం పెరిగి వారి జీవన ప్రమాణంకూడ పెరగగలదు. అలాగే ఇండ్లలో వాడకానికి పనికివచ్చే ముతక, మధ్యరకం బట్టలు తయారు చేయటాన్ని గ్రామీణ ప్రాంతాలకు ప్రత్యేకించవచ్చు. దీని మూలంగాకూడ స్వయంకల్పిత వృత్తిదారుల ఆదాయం, జీవనప్రమాణం, పనిపాటలు పెరగగలవు.

ఇక గ్రామీణ ప్రాంతాలకు ప్రత్యేకించవలసిన గృహ పరిశ్రమలు, మధ్యరకం పరిశ్రమలు ఉన్నవిగదా! పరిశ్రమలను దేశవ్యాప్తంగా, అన్ని ప్రాంతాలకు సమంగా విభజించి పెంపొందించే విధానం అవసరం. ఈ విధానంద్వారా పరిశ్రమలను గ్రామీణ ప్రాంతాలకు ప్రత్యేకించ వలసి ఉన్నది. పరిశ్రమలను వీలయినంతవరకు ఇలా దేశవ్యాప్తంచేసి ఇంచుమించు ప్రతి గ్రామము ఆర్థికంగా స్వయం సమృద్ధంగా ఉండటానికి సహాయపడాలి. వృత్తి సౌకర్యాలను అన్ని ప్రాంతాలకు చూపటం, ఆదాయాలకు మార్గం చూపటం దానికి

ఆదర్శాలు. అంతేకాక ఇలా చేసినందువల్ల ఒక ప్రాంతంలోని వారికి పనులుండి మరొక ప్రాంతంలోని వారికి పనులు దొరకని స్థితి ఏర్పడదు; అన్ని ప్రాంతాలు సమంగా అభివృద్ధి చెందుతవి; పరిశ్రమలుకూడ దేశమంతట విలసిల్లుతూ ఉంటవి.

ఇవి స్వయంకల్పిత వృత్తిదారులకు ఎంతో అవసరమైన విషయాలు. అయినప్పటికి ప్రభుత్వం ఈ విషయాలు తనకు పట్టీ పట్టనట్లుగా వ్యవహరిస్తుండటంచేత వీటిని గురించి ఇంత విపులంగా చెప్పవలసి వచ్చింది. ఈ ప్రభుత్వ నిర్లక్ష్యానికి ఉదాహరణలు కోకొల్లలుగా చూపవచ్చు. ఒకటి రెండు విషయాలు మాత్రమే ఇక్కడ చూపుతున్నాను. ఉత్పత్తి అధికం కావాలంటే శాస్త్రీయంగా పరిశీలింపబడిన విత్తనాలను రైతులకు అదునుకు సరఫరా చేయటం చాల ప్రధానం అన్న విషయం గుర్తించటానికి ప్రభుత్వానికి తొమ్మిది సంవత్సరాలు పట్టింది. కొత్తగా సాగులోకి తీసికొనిరాబడిన భూములమీద మొదటి 5 లేక 10 సంవత్సరాలవరకు ఎలాంటి అభివృద్ధి పన్నులు వేయరాదని గుర్తించటానికి కూడ ప్రభుత్వానికి దీర్ఘకాలం పట్టింది.

మన దేశంలోని ప్రత్యేకమైన సాంఘిక ఆర్థిక స్థితిగతుల మూలంగా ఉత్పన్నమయ్యే కొన్ని చిక్కులను పరిష్కరించటానికి ఈ స్వయంకల్పితవృత్తి సిద్ధాంతాన్ని ఒకమార్గంగా నేను ప్రతిపాదిస్తున్నాను. లక్షలాది కుటుంబాలకు పనిపాటలు చూపించటం మన దేశంలోని ప్రధాన సమస్య; ముందు నిర్వర్తించవలసిన కర్తవ్యం. పనిదొరకని రోజుల్లా

వీరికి ప్రస్తుతప్పదు. ఆధునిక స్థితిగతులలో నిరుద్యోగం ఆత్మ హత్యలకు, నేరాలకు, సంకుచితత్వానికి దారితీయక తప్పదు. జనసాంద్రత ఎక్కువగా ఉండే ప్రదేశాలలో ఈకారణం చేతనే ప్రతిఅంగుళం భూమి ఎవరో ఒకరి సొంతంగా ఉంటున్నది. అంతేకాక మానవునికి ఉపయోగపడగల పశు పక్ష్యాదులు సైతం వారివారి వ్యక్తిగత ఆస్తులుగా ఉంటున్నవి. పనిపాటలను అడిగేహక్కు ఉన్నదని ఆ దేశాలు గమనించినవి. ఇలాంటి దేశాలలో ప్రజలకు కావలసిన పనిపాటలు చూపించలేని పక్షంలో ప్రభుత్వం అలాంటి ప్రజలకు నిరుద్యోగ సహాయనిధి ఏర్పాటు చేస్తుంది. కాని భారత ప్రభుత్వం మాత్రం తనప్రజలకు పనిచూపించే స్థితిలో లేదు; నిరుద్యోగులకు ఆర్థికంగా సహాయపడగల స్థితిలో అంతకుముందే లేదు. అందుచేతనే ఈ స్వయంకల్పితవృత్తి వ్యవస్థలోని శక్తి సామర్థ్యాలు సక్రమంగా, సమగ్రంగా వినియోగ పడేటట్లు చూడాలని అంటున్నాను. ఈ స్వయంకల్పిత వృత్తి విధానం ఎంతో కాలంనుంచి ఆయాకాల పరీక్షలకు నిలబడి తట్టుకొంటు వస్తున్నది. కాబట్టి స్వయంకల్పిత వృత్తి విధానంలో ఈ చారిత్రక శక్తిసామర్థ్యాలు ఉన్నవని గుర్తించటం అవసరం.

# ద్వితీయాధ్యాయం

## సహకార సంఘాలు

మానవుడు హేతువాది. కాని ఈ హేతువాదంతో ప్రతి చిన్నపనిని వివరించటానికి మొదలుపెట్టి తన సహజమైన ఉద్రేకాలను, వాసనలను అణచివేసికొంటు పోవటం ప్రారంభిస్తే జీవితం యంత్రప్రాయమవుతుంది; మానవుని ఉద్రేకాలు, వాసనలు వాటి వాటి సహజ సౌందర్యాన్ని, ప్రయోజనాన్ని కోల్పోతవి. అలాంటి వ్యక్తికి తన జీవితాన్ని క్రమబద్ధంగా నడుపుకొంటున్నానన్న సంతృప్తి ఉన్నప్పటికి ఆ మేరకు అతడు తన జీవితసౌఖ్యం కోల్పోక తప్పదు. కాబట్టి హేతువాదానికి పరిమితులు ఉన్నవి. ఆ పరిమితులనుదాటి దానిని కొనసాగించటం మంచిదికాదు. ఇలాంటి దుష్పరిణామాన్ని తొలగించుకోవటానికి మానవుడు తన ఉద్రేకాలను, వాసనలను ఆయా పరిమితులవరకే హేతుబద్ధంచేసికోవాలి; ఆ తరువాత ఆ ఉద్రేకాలకు, వాసనలకు స్వేచ్ఛ ఇచ్చి తన జీవితం సఫలం చేసికోవలసి ఉంటుంది.

అయితే, ఇక్కడ ఒక విషయం చెప్పవలసి ఉన్నది. ఈ ఉద్రేకాలకు, వాసనలకు, అంతఃకరణకు సంపూర్ణ స్వేచ్ఛ ఇచ్చి అవి ఎలా ఆడిస్తే తాను అలా ఆడకూడదు. ఒకవేళ ఇలా వాటికి లొంగిపోతే జీవితంలో అరాజకం ప్రబలి, జీవితాదర్శాలే విఫలమై పోతవి. కాబట్టి ప్రతివ్యక్తి తన జీవితాదర్శాన్నిబట్టి కొన్ని హేతుబద్ధమైన అభ్యాసాలను ముందుగానే అలవరచుకోవాలి. ఆ తరువాత ప్రయత్న రహితంగానే ఇవి ఆచరణలోకి వస్తుంటవి. మనసారా కావాలని భావించిన అవసరాల ఫలితంగా ఏర్పడిన ఈ అలవాట్లవల్ల చాల ప్రయోజనం ఉంటుంది. మానవ జీవితంలోని ఉద్రేకాలకు, వాసనలకు ఈ అలవాట్లు సహాయకారులుగా ఉండటమే కాక, అవి క్రమబద్ధంగా, స్వేచ్ఛగా పనిచేస్తూ ఉండటానికి, జీవితంలోని ప్రతిసంఘటనలో, సన్నివేశంలో హేతుత్వం వ్యక్తం కావటానికి ఇవి సహాయపడగలవు. మానవుడు ఈ విధంగా హేతువాదిగా ఉంటూ సాధ్యమైనంత ఎక్కువ సౌఖ్యం, సంతోషం పొందగలుగుతూనే తన సహజమైన ఉద్రేకాలు, వాసనలు క్షీణించి పోకుండ కాపాడుకో గలుగుతాడు.

దేశాభివృద్ధిని ప్రణాళికా బద్ధంగా తీర్చి దిద్దుకొని అభివృద్ధి చేయటంలోకూడ ఇదే దృక్పథం అవలంబించటం అవసరం. ఇలాంటి కృషి దేశాభివృద్ధికి ఉపకరిస్తుంది. ప్రజల కార్యకలాపాలను, సాంఘిక కృషిని ప్రభుత్వం ప్రణాళికాబద్ధంచేయాలి; ఒక మార్గంలో నిర్వహించాలి. కాని ఈ నిర్వహించటం, క్రమబద్ధం చేయటం అనేవి అతిగా సాగరాదు. ఈ విష

యంలో ప్రభుత్వం కొంతవరకే జోక్యం కలిగించుకొని వ్యక్తి స్వేచ్ఛకు అవకాశం ఇయ్యాలి. వ్యక్తులు తమ శక్తి యుక్తులను వికసింప చేసికోవటానికి వీలుపడే కార్యకలాపాలను వారే తమంత తాము నిర్వహించుకొనగల అవకాశం ఇచ్చేటట్లుగా ఆర్థిక వ్యవస్థ ఉండాలి. అంతేకాని ఆర్థికాభివృద్ధి పేరుతో, ప్రణాళికల పేరుతో వ్యక్తుల స్వేచ్ఛకు, సొంత కార్యకలాపాలకు, పనిపాటలలో వారికి ఉండే స్వేచ్ఛకు అంతరాయం కలిగించరాదు. ఒక వ్యక్తి జీవితంలో హేతుబద్ధమైన అలవాట్లు ఎలాంటిపాత్ర వహిస్తవో మనం చూశాం. అలాగే ప్రభుత్వం సంఘంలో కొన్ని సంప్రదాయాలను, సంస్థలను ఏర్పరచి సంఘపు ఆర్థిక వ్యవస్థలో ఇవి తమ ప్రభావాన్ని చూపుతూ పనిచేసేటట్లు చూడాలి. హేతుబద్ధమైన అలవాట్లు వ్యక్తికి ఎలా ఉపయోగ పడగలవో ఈ సంస్థలు, సంప్రదాయాలు దేశ ఆర్థిక వ్యవస్థకు అలా ఉపయోగ పడగలవు.

ఆర్థిక సంబంధాలలో పరస్పరం పోటీ సహజంగా కనిపిస్తు ఉంటుంది. పరస్పర స్పర్థవల్ల, వస్తువుల కొఱతవల్ల ఈ పోటీ ఏర్పడుతుంటుంది. ఆర్థిక వ్యవస్థలోని పోటీకి కారణం ఇదే. ఆర్థిక వ్యవస్థలోని రెండవ అంశం సహకారం. పరస్పరాధారం ఈ సహకారానికి కారణం. ఒకరిమీద ఒకరు ఆధారపడవలసిన అవసరం ఉండటంచేత ఈ సహకారానికి అవకాశం, అవసరం కలుగుతున్నవి. ఇలా పరస్పరాధారం మీద ఆధారపడిన సహకారంకూడ ఆర్థికవ్యవస్థకు పైన వివరించిన పోటీవలెనె సహజ లక్షణం. ఆర్థిక వ్యవస్థలో ఈ పోటీ ఎంత ప్రధానంగా ఉంటుందో ఈ సహకారంకూడ అంత

అవసరమే. ఈ పోటీ, సహకారం రెండుకూడ సాంఘికంగా ఉపయోగపడేవే. పైగా వీటిని తప్పించుకొని పోవటంకూడ సాధ్యంకాదు. ఇవి రెండు ఇలా ఉంటూనే పరస్పరం ఒక దానిపై ఒకటి తనప్రభావాన్ని ప్రసరింపచేస్తుండటం మూలంగానే సంఘపు ఆర్థికవ్యవస్థ స్థిరంగా ఉండగలుగు తున్నది. అనగా మన ఆర్థిక వ్యవస్థ స్థిరీకరణకు ఇవి రెండు ఉండటం అవసరం; కేవలం ఉండటమేకాక పరస్పర ప్రభావానికి లోను కావటంకూడ అవసరం.

ఈ పై విషయాల దృష్ట్యా మన సోషలిస్టుసంఘ ఆదర్శాన్నికూడ మరొకసారి పరిశీలించుకోవలసి ఉంటుంది. మన ఈ గమ్యస్థానాన్ని చేరటానికి కావలసిన నూతన మార్గాలను అన్వేషించి దర్శింప చేసికోవలసి ఉంటుంది.

మన ఆర్థిక వ్యవస్థలోని కీలక రంగాలపై యాజమాన్యం వహించి వాటిని తన అధీనంలో ఉంచుకొనటానికి ప్రభుత్వానికి అధికారం ఉన్నది. ఈ అధికారాన్ని ప్రభుత్వానికి మనమే ఇచ్చాం. అయితే వ్యక్తులకుకూడ ఈ స్వేచ్ఛ ఇస్తూ కొన్ని ఆస్తి పాస్తులమీద వారికి యాజమాన్యపు హక్కులు ఉండటానికి మన రాజ్యాంగంలో మనం అంగీకరించాము. వ్యక్తులు కొన్ని ఆస్తులను సొంత ఆస్తులుగా తమ క్రింద ఉంచుకొంటు సంఘానికి అవసరమైన ఉత్పత్తులను అందిస్తున్నారు; పని పాటలను కల్పిస్తున్నారు. ఇలా కీలకరంగాలపై ప్రభుత్వానికి యాజమాన్యం ఉంటూనే కొన్ని ఆస్తులపై, రంగాలపై వ్యక్తులకు యాజమాన్యం ఉంటున్నది. కాని ఈవ్యక్తుల కృషి సొంత

ఆస్తులమూలంగా లభిస్తున్న స్వేచ్ఛాపూరితమైన ఆర్థికవ్యవస్థ ప్రభుత్వంతో సహకరించాలి. అలాగే ప్రభుత్వం ఈ వ్యక్తులకు సహాయపడాలి. ఈ పరస్పర సహాయ సానుభూతులు కొరవడితే మాత్రం ప్రణాళికాబద్ధమై క్రమబద్ధమైన అభివృద్ధి దుస్సాధం అవుతుంది. సమర్థవంతంగా ప్రణాళికలు వేయవలసిందే. అయితే, ఈ కారణంతో ప్రభుత్వం స్వయంకల్పిత వృత్తిదారుల కార్యకలాపాలలోను, వ్యక్తిక కృషితో సాహసం చేస్తున్నవారిమీద జోక్యం కలిగించుకోరాదు; ఈ స్వేచ్ఛా స్వాతంత్ర్యాలపై ప్రభుత్వం తన హస్తాన్ని చాచి అరికట్టరాదు.

సొంత ఆస్తులతో, స్వేచ్ఛాస్వాతంత్ర్యాలతో తమ ఇష్టం వచ్చినట్లు వ్యవహరించే ఈ స్వయంకల్పిత వృత్తి దారులకు ప్రభుత్వానికి సహకారాన్ని సాధించేది ఎలా ? అనే ప్రశ్న రావచ్చు. దీనికి ఒకమార్గం ఉన్నది; ప్రజాస్వామిక బద్ధమైన ఆ మార్గాన్ని అనుసరించటం శ్రేయస్కరంగా ఉంటుంది. సహకార సంఘాలద్వారా ప్రజలు తమంతతామే ఐచ్ఛికంగా కొన్ని సంస్థలను ఏర్పరచుకొనేటట్లు చేయాలి; అందుకు ప్రోత్సాహం ఇచ్చి మార్గం చూపాలి. ఇలాంటి సంఘాలు ఆ యా ప్రాంతాలలోని స్వయం కల్పిత వృత్తిదారులైన రైతులను, చేతి వృత్తులవారిని, కుటీర గ్రామీణ పరిశ్రమల వారిని ఏకముఖంచేసి సంఘటిత పరచి సమన్వయ పూరితంగా పనిపాటలను నిర్వహించుకొనేటట్లు చేయగలవు. అంతేకాక దేశాభివృద్ధికి మనం నిర్ణయించుకొన్న ప్రమాణాలను అందుకొనటానికి ఈ వైయక్తిక ప్రజలు ప్రభుత్వంతో సహకరించి,

కలిసి కృషి చేయటానికి కూడ ఈ సహకార సంఘాలు సహాయోధ్యత వహించగలవు. అంటే స్వయంకల్పిత వృత్తి దారులకు ప్రభుత్వానికి మధ్య ఈ సహకార సంఘాలు వంతెనలలాగా ఉపయోగపడగలవు. స్వయం కల్పితవృత్తి దారుల కృషి దేశావసరాలకు అనుగుణంగా, అభిముఖంగా ఉండేటట్లు చేయటానికి కూడ ఈ సంఘాలు అమూల్యమైన కృషి చేయగల అవకాశం ఉన్నది. ప్రజాస్వామిక ప్రభుత్వం నిర్ణయించిన అభివృద్ధి ప్రమాణాలను ఈ సంఘాలు సాధించగలవు; ఆ ప్రమాణాలు సాధించబడేటట్లుగా స్వయంకల్పిత వృత్తిదారులపై తమ ప్రభావాన్ని, పలుకుబడిని ఉపయోగించగలవు. అందుచేత ఇలాంటి సంఘాలను స్థాపించి, దేశానికి అవసరమైన సాంఘికాదర్శాలు ఈ సంఘాలలో ప్రధానంగా ఉండేటట్లు చూడాలి. ప్రభుత్వానికి స్వయంకల్పిత వృత్తిదారులకు పరస్పరాధారంతో కూడిన సహకారం ఉన్నప్పుడు ప్రజలకు కలగగల మేళ్ళను గురించి ఈ సంఘాలకు ప్రబోధించి ఉత్తేజపరచాలి. అలాచేసిన పక్షంలో ప్రభుత్వం ఏర్పరచే అభివృద్ధి ప్రణాళికల ప్రమాణాలను తేలికగా అందుకోవచ్చు

అయితే కేపిటలిస్టు రంగంలో ఈ సహకారానికి అంతగా అవకాశం కనిపించదు. ఈ కేపిటలిస్టురంగం అంతులేని పోటీతో నిండిపోయింది; ఈ లోపాన్ని సవరించాలంటె సహకారభావాన్ని, సహకార సంఘాలను ఏర్పరచటం అవసరం. అప్పుడే ఇవి రెండు సమమైన పాళ్ళలో ఉండగలవు; అలా ఉండటం అవసరమని ముందే తెలిసికొన్నాం గదా! స్వయంకల్పిత వృత్తిదారుల హక్కులు, ఆశయాలు,

ప్రయోజనాలు సంరక్షింపబడే విధంగా ఈ సహకారసంస్థలు ఏర్పాటు కావాలి.

మన సంఘానికి కావలసిన పైన వివరింపబడిన అవసరాలను తీర్చటానికి సహకారసంఘం ఉత్తమసంస్థగా ఉండగలదు. మనం అనుకొంటున్న ఈ సహకారసంస్థ సామూహిక ఆర్థిక వ్యవస్థలోని సహకార సంఘాలవంటిదికాదు; కేపిటలిస్టు దేశాలలోని సహకార సంఘాలవంటిదికూడకాదు. మన సహకార సంఘానికి స్వేచ్ఛాస్వాతంత్ర్యాలు, మంచి అవకాశాలు ఉంటవి. అందుచేత స్వేచ్ఛాస్వాతంత్ర్యాలకు మూలాధారమైన సొంత ఆస్తిని అనుమతించని సామూహిక ఆర్థిక వ్యవస్థలోని సహకార సంఘానికి మనసహకార సంఘానికి పోలికేలేదు. సామూహిక ఆర్థిక వ్యవస్థలోని సహకార సంఘాల సభ్యులకు ప్రభుత్వశ్రామికులా, ఉద్యోగులా అన్న వివక్షకు మించిన స్వాతంత్ర్యం ఉండదు. ఇక కేపిటలిస్టు దేశాలలోని సహకార సంఘాలు చూద్దామా అంటె వాటికి ప్రభుత్వసహాయంగాని, మద్దతుగాని ఉండదు. పెద్దపెద్ద కేపిటలిస్టులతో పోటీచేసి నిలబడవలసిన పరిస్థితి వీటికి తప్పదు. కాని మన సహకార సంఘాలకు ఈ చిక్కులు, అనర్థకాలు ఉండవు; ఉండరాదు. అయితే ఈ సహకార సంఘాలను ఎలా నిర్మించుకోవాలి అన్న సమస్య ఉన్నది. ప్రపంచంలోని భిన్నభిన్న దేశాలు తమతమ సాంఘిక పరిస్థితులనుబట్టి తమకు ఉన్న ఆ యా అవసరాలు తీరే విధంగా ఈ సహకార సంఘాలను ఏర్పాటు చేసికొన్నవి.

కాబట్టి సోషలిస్టు ఆర్థికవ్యవస్థకు పయనిస్తున్న ఈ సంధి కాలంలోకూడ సహకారసంఘాలు చాలప్రముఖ పాత్రనే వహించగలవు. ఇప్పుడిప్పుడే అభివృద్ధి చెందుతున్న మన ఆర్థికవ్యవస్థలో ప్రభుత్వరంగంగాని, వ్యక్తిక రంగంగాని ఒకదానికొకటి మితిమీరిపోకుండ సహకారసంఘాలు వీటి రెంటిని అదుపులో పెట్టగలవు. ఈ సహకారసంఘాలు ప్రథమ దశలో ఇలా మధ్యేమార్గంగా వ్యవహరిస్తూ స్వయంకల్పిత వృత్తిదారులను బలపరచగలవు. ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి చెందటానికి ప్రభుత్వ వ్యక్తికరంగాలు రెండు అవసరమే అయినప్పటికి వీటిని అవసరమైన వాళ్ళలో అదుపులో పెట్టటానికి ఈ సహకార సంఘాలు పాటుపడతవి. ఇక రెండవ దశకు వచ్చే సరికి ఈ సహకారసంఘాలు ప్రభుత్వ వ్యక్తిక రంగాల రెంటిమీదకూడ పరిమితులను విధించి స్వయంకల్పిత వృత్తి రంగానికి ఆసటగా నిలబడతవి. ఇక చివరిదశకు వచ్చేటప్పటికి అనేక ఆర్థిక విషయాలలో వ్యక్తికరంగాన్ని తొలగించటానికి ఇవి తోడ్పడతవి.

ఈ సహకారసంఘ నిర్మాణంకూడ ఈ ప్రయాణంలో క్రమక్రమంగా మార్పు చెందుతు ఉంటుంది; నూతన అనుభవాల దృష్ట్యా అవసరమైన మార్పులకు, చేర్పులకు లోనవుతు ఉంటుంది. అయితే ఈ మార్పులలో ఒకప్రధాన లక్షణం మాత్రం విస్మరించ వీలులేకుండ అభివృద్ధి చెందుతు ఉంటుంది. సంఘసభ్యులకు స్వేచ్ఛాస్వాతంత్ర్యాలు, ఉత్సాహ ప్రోత్సాహాలు, శ్రద్ధాసక్తులు ఎప్పటికప్పుడు నూతనంగా పెంపొందే విధానంతోనే ఈ అభివృద్ధిగమనం సాగుతుంటుంది. వికేంద్రీ

కరణాను సాధ్యమైనంత అధికంగా అమలుచేయగల అభ్యుదయ పూరితమైన సంఘం వికసించాలన్నా, వ్యక్తుల విశిష్ట లక్షణాలతో సంఘం ఆరోగ్యవంతంగా పెంపొందాలన్నా సంఘసభ్యులకు స్వేచ్ఛాస్వాతంత్ర్యాలు, తమ కార్యకలాపాల పట్ల సహజమైన శ్రద్ధాసక్తులు ఉండటం అవసరం. ఈ విశిష్ట లక్షణాలన్నీ మన స్వయంకల్పిత వృత్తివ్యవస్థలో ఉన్నవి. పైగా ఈ సహకారసంఘాలే ప్రణాళికలను అమలుపర్చగలవు. కాని ఈ సహకారసంఘాలను గురించికూడ కొన్ని జాగ్రత్తలు తీసికోవలసి ఉన్నది. ప్రభుత్వ ప్రతినిధులను వీటిలో భాగస్వాములను చేయరాదు. ప్రభుత్వ ప్రతినిధుల భాగస్వామ్యంతో ప్రభుత్వ సహాయం ఎదో కొంత లభించగలదన్న ఆశలకు ఈ సంఘం బలహీనంగా లొంగరాదు. రాజకీయ పక్షాల పాక్షికత్వానికి, సంఘంలోని ముఠాతత్త్వాలకు ఈ సంఘాలు చాలదూరంగా ఉండటం ప్రధానం. ప్రజాస్వామిక సూత్రాలకు అనుగుణమైన సాంఘిక జీవితాన్ని ప్రసాదిస్తున్న సంస్థలకు — అంటే స్వయంకల్పిత వృత్తి వ్యవస్థకు — ఈ సహకార సంఘాలు విరుద్ధంగా, వ్యతిరేకంగా తయారు కాకుండ ఉండటానికి ప్రత్యేకశ్రద్ధ తీసికొనటంకూడ చాలముఖ్యం. ఈ సందర్భంలో ప్రజాస్వామిక దేశాలైన నార్వే, డెన్మార్కు, స్వీడన్, స్విట్జర్లెండ్, జపాన్, పెరుగ్వే దేశాల అనుభవాలనుంచి మనం ఎన్నో పాఠాలు నేర్చుకొనవలసి ఉన్నది. మనసాంఘిక వ్యవస్థలోని స్వయంకల్పిత వృత్తి రంగానికి ఈ సహకార సంఘాలు సహచరులేకాని ప్రత్యర్థులు కాదని మనం గ్రహించవలసి ఉన్నది.

ప్రభుత్వరంగంలోని కొన్ని అంశాలకు, కేపిటలిస్టు రంగానికి ఈ సహకారోద్యమం పోటీగా నిలబడవచ్చు. అయితే స్వయంకల్పిత వృత్తివ్యవస్థతో మాత్రం సహకారోద్యమానికి ఎలాంటిపోటీ ఉండదు. దీనికి కారణంకూడ ఉన్నది. సహకార రంగం లేనిపక్షంలో ఈ స్వయంకల్పిత వృత్తిదారులు, చేతివృత్తులవారు విడివిడిగా, ఎవరికివారుగా జీవించవలసి వస్తుంది. వీరి కార్యకలాపాలకు మధ్య సమన్వయం ఉండదు. ఆధునిక సంఘాలలో ఈ ప్రమాదం మరింత హెచ్చు. అందుచేత సహకార రంగం స్వయంకల్పిత వృత్తివ్యవస్థకు అత్యంతావశ్యకమైన నేస్తంగా వర్ధిల్లగలదు.

కాని మన ప్రణాళికాకారులదృష్టి ఇలాలేదు. సహకార రంగాన్ని వీరు స్వయంకల్పిత వృత్తిరంగానికి ప్రతిగా, దానికి బదులుగా స్థాపించాలన్న ధోరణిలో ఆలోచిస్తున్నారు. సహకారరంగానికి స్వయం కల్పిత వృత్తిదారులు విరోధులన్న ధోరణిలో వీరు ప్రవర్తిస్తున్నారు. వ్యవసాయరంగంలోను, ఇతర చేతివృత్తులవారి వ్యవస్థలోను సొంతంగా తమ జీవికను సంపాదించుకొంటు స్వేచ్ఛాస్వాతంత్ర్యాలతో జీవిస్తున్న స్వతంత్ర ప్రతిపత్తిగల ఆ యా కుటుంబాలకు నేస్తంగాఉండి, తనసహాయాన్ని వారికి అందించటమే సహకార సంఘాల కర్తవ్యం. స్వయం కల్పితవృత్తిదారులకు కావలసిన ఋణాలు, మార్కెటింగ్ సౌకర్యాలు మొదలైనవాటిని సమకూర్చే బాధ్యత ఈ సహకార సంఘాలు వహించాలి. ఇంతవరకు ఈ బాధ్యతనుగురించి పట్టించుకొన్నవారేలేరు. స్వయంకల్పిత వృత్తితో స్వేచ్ఛగా జీవిస్తున్న ఈ కుటుంబాలు కేవలం



3)

తాత్కాలికమైన ఏర్పాటే అని, సహకారసంఘాలను ప్రవేశ పెట్టటం ద్వారా వీటిని తీసివేయాలని మన ప్రణాళికాకారులు భావిస్తున్నట్లు ఉన్నారు. ఇలా భావిస్తే మాత్రం వారు ప్రజా స్వామిక వ్యతిరేక ధోరణిని, అభివృద్ధి నిరోధక మార్గాన్ని అవలంబించినవారు అవుతారు. స్వయం కల్పిత వృత్తితో జీవిస్తున్న కుటుంబాలకు ఆసటగా నిలబడి, సానుభూతితో అర్థం చేసికొని సహాయంచేస్తే సంఘజీవనం అస్తవ్యస్తం కాకుండా సాంఘికాభివృద్ధిని సాధించవచ్చు; ప్రజాస్వామ్యాన్ని నిలబెట్టుకొనవచ్చు. దీనికంతకు ప్రధానంగా కావలసింది ఈ స్వయం కల్పిత వృత్తిదారుల కుటుంబాలపట్ల కొంత సానుభూతి మాత్రమే! కాబట్టి సేవా సహకార సంఘాలే రైతులకు నేస్తాలుగా ఉండగలవు; ఈ సేవాసహకారసంఘాలే రైతుల స్నేహసహకారాలను, సానుభూతిని పొందగలవు గాని సహకార వ్యవసాయ సంఘాలు మాత్రం రైతులకు ఇష్టం కావు. కాబట్టి సాంఘికాభ్యుదయాన్ని సాధించాలంటె సహకార సంఘాలకు, స్వయం కల్పిత వృత్తిదారులకు అను బంధ బాంధవ్యాలు పెరగాలి. అంతే కాని ఇవి రెండు ప్రత్యర్థులనుకొని వీటిని విడదీయటం మాత్రం సాంఘికాభివృద్ధికి మార్గంకాదు.

కనుక, ఈ పై విషయాల దృష్ట్యా మన ప్రణాళికాకారులు ఒక విషయాన్ని గమనించ వలసి ఉన్నది. మన సంఘ ఆర్థిక వ్యవస్థను వ్యక్తికరంగం, ప్రభుత్వరంగంగా విభజించటం కాక మన దేశంలోని రైతులు, ఇతర చేతి వృత్తులవారు కొనసాగిస్తున్న కార్యకలాపాలదృష్ట్యా, దేశానికి వారు

చేస్తున్న సేవ దృష్ట్యా వారిని ఒక ప్రత్యేక వ్యవస్థగా ప్రభుత్వం గుర్తించాలి. ఇలా గుర్తించవలసిన అవసరం ఉన్నదని, తదనుగుణంగా దేశ ఆర్థిక వ్యవస్థను పునర్వ్యవస్థీకరించాలని ప్రణాళికాకారులు గమనించాలి. స్వయం కల్పిత వృత్తిదారులకు అనేక సౌకర్యాలు కావలసి ఉన్నవి. వీటిని అన్నింటిని సహకార సంఘాలద్వారా వీరికి అందించాలి; కీలకస్థానాలను ఆక్రమించి వీరిని దోపిడీ చేస్తున్న వారికి అవకాశం లేకుండా చేయాలి. ఇలాంటి సౌకర్యాలు కలగచేసే సహకార సంఘాలు ప్రస్తుతం చేనేత వారికి ఉన్నవి. ఇలాంటి వాటిని ఇతర స్వయం కల్పిత వృత్తిదారులకుకూడ ఏర్పాటు చేయాలి. ఇవన్నీ జరిగిననాడు ఆధునికసంఘంపై కేపిటలిస్టుల పలుకుబడి, పెత్తనం పడిపోతవి. ప్రభుత్వరంగం కూడ ఇదే విధంగా సహకార సంఘాలకు తోడ్పడాలి; అందుకు అనువైన మార్గాలను వేసికోవాలి. అప్పుడే ఈ స్వయం కల్పిత వృత్తిదారుల అవసరాలు తీరగలవు.

ఈ పరిశీలననుబట్టి తేలిన దేమంటె ఈ స్వయం కల్పిత వృత్తిదారులది మన ఆర్థిక వ్యవస్థలో ఒక ప్రత్యేకరంగం. స్వేచ్ఛా స్వాతంత్ర్యాలమీద, సాంఘిక న్యాయంమీద, దోపిడికి ఆస్కారంలేని ఆర్థిక వ్యవస్థమీద ఆధారపడిన ప్రజాస్వామిక సోషలిస్టు సంఘాన్ని స్థాపించుకోవటానికి ఈ స్వయం కల్పిత వృత్తి వ్యవస్థే మనకు మూలాధారం.

స్వయం కల్పిత వృత్తిదారుల రంగంలో సేవాసహకార సంఘాలను ఏర్పరచ గలిగితే మన ఉత్పత్తి తప్పక పెరుగుతుంది.

స్వయం కల్పిత వృత్తిదారులకు కావలసిన సౌకర్యాలను అందించే కీలకస్థానాలను వ్యక్తుల చేతులలోనుంచి లాక్కొని సేవాసహకారసంఘాల వశంచేయాలి. ఈ పని చేయగలిగితే దేశంలోని సాధన సంపదలు, కృషి వృథాపోయే అవకాశం ఉండదు; ఈ స్వయం కల్పిత వృత్తిదారులు పరుల దోపిడీకి లోనుకావలసిన దుర్గతి తప్పిపోతుంది; వీరికి కావలసిన సౌకర్యాలు చౌకగా, సమర్థ వంతంగా అందటానికి వీలుఉంటుంది.

సహకార సంఘాలను విస్తృతం చేయటం ద్వారా స్వయం కల్పిత వృత్తిదారుల ఆదాయం పెంచవచ్చు. ఇలా పెరిగిన ఈ ఆదాయాన్ని అధికోత్పత్తికృషిలో తిరిగి పెట్టుబడి పెట్టవచ్చు; తద్ద్వారా దేశానికి కావలసిన ప్రధాన ఆహార ధాన్యాలకు కొరత లేకుండా చేయవచ్చు.

కో-ఆపరేటివ్ స్టోర్సుల సహకారంతో దేశంలోని ఆహారోత్పత్తిని, ఆహార ధాన్యాల వాడకానికి సంబంధించిన వివరాలను శాస్త్రీయంగా తయారు చేసికొనవచ్చు. ఏ యేటి కాయేడు ముందుగానే ఈ పని చేసికొని అంచనాలను తయారుచేసికొనే వీలున్నది. మార్కెటింగ్ సంఘాలు, సేవా సహకారసంఘాలు, ఆహారపదార్థాలను తయారు చేసే కేంద్రాలుకూడ ఈ అంచనాలను తయారు చేయటంలో సహాయపడగలవు.

దేశంలోని ప్రధాన పరిశ్రమల అభివృద్ధికి ఇస్తున్న ప్రాధాన్యంవల్ల కలగగల ఆర్థిక ఫలితాలను సహకారరంగాన్ని అభివృద్ధి చేయటం ద్వారా సాధించుకోవచ్చు.

మన ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి చెందుతూ ఉన్న దశలో ఉన్నది. ఈ పరిస్థితిలో దేశంలోని నిరుద్యోగ సమస్యను పరిష్కరించటానికి ఈ సహకారరంగమే సమర్థవంతంగా కృషి చేయగలదు.

మనం రూపొందించుకొంటున్న ఆదర్శాలదృష్ట్యా ఈ విధానాన్ని అమలు చేయటం అవసరం. అంతేకాక మన దేశ పరిస్థితులదృష్ట్యా పరిశీలించినప్పటికి ఈ విధానమే అవలంబించవలసి ఉన్నది. దేశంలోని స్వయం కల్పిత వృత్తిదారులు, ఇతర చేతివృత్తులవారు అనుభవిస్తున్న కష్టనష్టాలను, ఘోర పరిస్థితులను, నిరుద్యోగాన్ని, దారిద్ర్యాన్ని నివారించటానికి ఈ సహకారోద్యమమే చక్కని మార్గం. అయితే వీరికి ఉన్న స్వయం కల్పిత వృత్తి హోదాకు, తమతమ ఆస్తులపై వీరికి గల యాజమాన్యపు హక్కులకు ఈ సహకారోద్యమం ఎలాంటి ప్రమాదం కలిగించరాదు. వీటి ప్రాముఖ్యాన్ని విస్మరించటంకూడ పనికిరాదు.

# తృతీయాధ్యాయం

## అధికోత్పత్తి వివాదాలు

"ప్రస్తుతం ప్రభుత్వం రైతులపట్ల అనుమానంతో, వ్యతిరేకతతో కూడిన దృక్పథాన్ని ప్రదర్శిస్తున్నది. ఈ ధోరణిని విరమించని పక్షంలో దేశ ఆహారోత్పత్తిని అధిక తమం చేయటం, విదేశీయ ఆహారధాన్యాల దిగుమతిని తగ్గించటం సాధ్యంకాదు."

తన బాధ్యత ఎలా పోయినప్పటికి అధికోత్పత్తి సాధించలేక పోతున్నారని ప్రభుత్వం రైతులపై నేరంమోపటం మాత్రం విచారకరం. ఆహారపదార్థాల ఉత్పత్తిని ఎలా అధికంచేయాలో మార్గాలు సూచించవలసినదిగా నియమించబడిన సంఘాలు చేసిన సూచనలనుమాత్రం ప్రభుత్వం ఇంతవరకు అమలు చేయలేకపోయింది. దేశంలోని ప్రధాన ఆహారధాన్యాలైన ధాన్యానికి గోధుమలకు కనీసధరలను, గిట్టుబాటు ధరలను నిర్ణయించి అమలు చేయాలన్న సూచనను ప్రభుత్వం ఇంతవరకు ఆచరణలో పెట్టలేకపోయింది. పారిశ్రామిక రంగంపట్ల కూడ ప్రభుత్వ దృక్పథం ఇలాగే ఉన్నదా? పారిశ్రామి

కోత్పత్తులు పెరగాలంటె పారిశ్రామికులకు, పారిశ్రామిక కూలీలకు అధికమైన శ్రద్ధాసక్తులు, ఉత్సాహప్రోత్సాహాలు అవసరమని ప్రభుత్వం గుర్తించింది; తదనుగుణంగానే ప్రవర్తిస్తున్నది. కాని దేశంలో ఆహారోత్పత్తి చేస్తున్న రైతులకు, శ్రామికులకు – వీరు దేశజనసంఖ్యలో అత్యధిక భాగం అయినప్పటికి – కూడ ఈ అవసరం ఉన్నట్లు ప్రభుత్వం గమనించక పోవటానికి కారణం ఏమిటి ? ప్రభుత్వోద్యోగులకు కలిగించవలసిన సౌకర్యాలను గురించి, అదనపు వేతనాలను, భత్యాలను గురించి, ఉద్యోగనియమాలను గురించి పరిశీలించి తగిన సూచనలుచేయటానికి స్వాతంత్ర్య సంపాదనానంతరం వెంటనే ఒక సంఘం (పేకమీషన్) నియమించబడింది. ఈ సంఘం చేసిన సూచనలు అమలుచేయబడినవి. ఆ తరువాత మళ్ళీ రెండవ సంఘంకూడ నియమించబడింది. ఈ రెండవ సంఘం వచ్చేలోపుగా ప్రభుత్వోద్యోగులను సంతృప్తి పరచటానికి కొంత తాత్కాలిక సహాయంకూడ చేయబడింది. కాని రైతులకు గిట్టుబాటుధరలను నిర్ణయించటంకోసం నియమించబడిన అశోకమెహతా సంఘాన్ని గురించి ప్రచారం తప్ప ఈ సంఘం చేసిన సూచనలను మాత్రం ప్రభుత్వం పట్టించుకోనేలేదు. రైతులంటే ప్రభుత్వానికి ఉన్న ఉదాసీనతకు, వ్యతిరేకతకు మరొక ఉదాహరణ చూపితే చాలునను కొంటాను. రైతుల భూవసతులకు గరిష్ఠపరిమితులు నిర్ణయించి అమలు చేయవలసినదిగా కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వాలను ఒత్తిడి చేస్తున్నది. కాని ఇదే విధంగా ప్రభుత్వోద్యోగుల వేతనాలకు, పట్టణాలలోని ఇతర వృత్తులవారి ఆదాయాలకుకూడ

గరిష్ఠ పరిమితులు విధించాలని అడిగితే అందుకు మాత్రం అంగీకరించటం లేదు.

దూషణోద్యమం

పట్టణాలలోను, గ్రామీణ ప్రాంతాలలోనుగల ఆహార ధాన్యాల వాడకం దారులకు రైతులపట్ల ద్వేషం కలిగించటానికి కొన్ని రాజకీయ శక్తులు కుయుక్తులతో ప్రయత్నిస్తున్నవి. దీనిని గురించి ఒక మాట చెప్పవలసి ఉన్నది. రైతులకుగాని, రైతుల పక్షాన పోరాడుతున్న మాకుగాని ఈ వాడకం దారులకు కష్టనష్టాలు కలిగించాలని ఏ కోశాన లేదని మాత్రం గట్టిగా చెప్పగలను. ఈ వాడకందారులు తమ తమ వృత్తులతో తమకు ఎలాంటి జీవన సౌకర్యాలు, రాబడి కావాలని కోరుకొంటున్నారో రైతులుకూడ అదే విధంగా తమకు కనీస జీవన సౌకర్యాలు, ఆదాయం కావాలని కోరుతున్నారు. అంతేకాని వాడకందారులను దోపిడి చేయాలన్న దురాశ రైతులకు ఎప్పుడూ లేదు. తాము కూడ మనుష్యుల వలె జీవించటానికి కావలసిన ఆదాయాన్ని సమకూర్చే విధంగా తమ ధాన్యానికి కనీసపు గిట్టుబాటుధర ఉండాలని మాత్రమే రైతులు కోరుతున్నారు. పరిశ్రమలలో, కర్మాగారాలలో పనిచేస్తున్న సాంకేతిక కార్మికులకు, ప్రభుత్వ కార్యాలయాలలోని ఉద్యోగులకు లభిస్తున్నపాటి జీవన సౌకర్యాలు మాత్రమే రైతులు కోరుతున్నారు. ఆహార ధాన్యాల వాడకం దారులు రైతులు కోరుతున్న ఈ కనీసపుకోర్కెను, సమంజసమైన కోర్కెను తిరస్కరించలేరు. అనుదినం పెరిగిపోతున్న జీవనవ్యయం దృష్ట్యా తమ వేతనాలు, భత్యాలు

పెరగాలని ఆందోళన చేస్తూ, తమ కోర్కెలను సాధించు కొంటున్న ఈ వాడకం దారులు రైతులు కోరుతున్న ఈ కనీ సపు జీవనవసతి సౌకర్యాన్ని ద్వేషించలేరు గదా!

ధరల స్థిరీకరణ

ఆహారధాన్యాల ధరల స్థిరీకరణను రైతులుకూడ కోరు తున్నారని, ధరలను స్థిరీకరించటంలో వారికి ఎలాంటి అభ్యం తరము లేదని గట్టిగా చెప్పగలను. ఆహారధాన్యాల ధరలను స్థిరీకరిస్తూ తమకువచ్చే వెలలకు తాము చెల్లించే ధరలకు మధ్య ఉంటున్న వ్యత్యాసాన్ని సాధ్యమైనంతవరకు తగ్గించాలని రైతులు కోరుతున్నారు. రైతులు కోరుతున్నది మనుష్యు లుగా జీవించటానికి కావలసిన స్థితిగతులేకాని లాభాలుకాదు. రైతులు లాభాలకోసం కూర్చున్న వ్యాపారులు కారు గదా! ఏ రోజు కారోజు అస్తవ్యస్త మవుతూ ఇష్టంవచ్చినట్లు మారి పోతున్న మార్కెట్ల గతుకుల నడకలో పడి నలిగి పోకుండా ఉండాలని మాత్రమే రైతులు కోరుతున్నారు. రైతులుకూడ ప్రభుత్వ స్నేహితులేనని, సంఘసేవలో భాగ స్వాములేనని, ప్రభుత్వ విరోధులు కారని ప్రభుత్వం గుర్తించా లని వారు కోరుతున్నారు. పంట చేతికి రాగానే సంఘ సేవ కోసం ఏర్పడిన ఒక ప్రాతినిధ్య సంఘం ఆ పంటను తీసి కోవా లని రైతులు కోరుతున్నారు. ఇలా తీసికొన్న పంటకు ఈ సంఘం సంవత్సరం పొడవునా వాడకం దారులనుంచి గ్రహించే ధరలను, లాభాలను తమకుకూడ పంచాలని, ఈ పంచటంలో సహకార సంఘాల లాభాల పంపిణీ విధానాన్ని అనుసరించాలని, ఈ సంఘం మీద తమకుకూడ పెత్తనం

ఉండాలని రైతులు అడుగుతున్నారు. ఇలాంటి సంఘం కేవలం లాభాలకోసమే కూర్పకూడదు. లాభంకాని నష్టం కాని లేకుండేటట్లుగా ఉత్పత్తిదారులకు, వాడకందారులకు సౌకర్యాలుకలిగించే ఆశయంతో ఈ సంఘం నడవాలి.

ఆహారధాన్యాలకు సబ్సిడీలు

ఆహారధాన్యాలను కొనలేని బీదసాదలు సంఘంలో ఎంతోమందిఉన్నారు. ఇలాంటివారికి ఆహారధాన్యాలను సరస మైన ధరలకు అందించటానికి ప్రభుత్వం కృషి చేయవలసిందే. అందుకై ఆహారధాన్యాల ధరలకు సబ్సిడీలు ఇచ్చే బాధ్య తను ప్రభుత్వం తీసికోవాలన్న ప్రతిపాదననుకూడ నేను ఆహ్వానిస్తున్నాను. ఈ సూత్రాన్ని ప్రభుత్వంకూడ అంగీక రించింది. కాని ఇందుకోసం ప్రత్యేకించబడిన 25 కోట్ల రూపా యలను విదేశ ఆహారధాన్యాలను చాల అధికమైన ధరలకు కొని, చౌకగా అమ్మటం కోసమే వినియోగిస్తున్నది. ఇందుకోసం చౌకడిపోలు నడుపుతున్నది. ఈ ధనాన్ని ఇలా వినియోగించటం మాత్రం రైతుల ప్రయోజనాలకు విరుద్ధం. ఆహారధాన్యాల సబ్సిడీలకోసం కేటాయించబడిన ఇంత మొత్తంధనాన్ని విదేశ ధాన్యాలకొనుగోలుకు వినియోగించి ప్రభుత్వం దేశీయ ఆహార ధాన్యాలకు ధరలు లేవకుండ చేస్తున్నది. దీనితో దేశంలోని ఆహార ధాన్యాలకు గిట్టు బాటు ధరలు లేకుండా పోతున్నవి. సంఘ వ్యతిరేకమైన ఈ ప్రభుత్వ విధానానికి రైతులు అంగీకరించరు. ఆహార ధాన్యాల సబ్సిడీలకోసం ప్రత్యేకించబడిన ఇంత మొత్తం ధనాన్ని విదేశాలకు చెల్లిస్తు ఉండటంచేత దేశంలోని రైతు

లకు ఆహారోత్పత్తి కృషిలో శ్రద్ధాసక్తులు కలగటంలేదు; వీరి పంటలకు గిట్టుబాటు ధరలు రావటంలేదు. దీనితో రైతులలో అధికోత్పత్తి కృషి మందగిస్తున్నది. ఆహార విషయంలో స్వయం సమృద్ధిని సాధించాలని చేస్తున్న ప్రయత్నాలు విజయవంతం కావటానికి ఆలస్యం అవుతున్నది. అందుచేత ప్రభుత్వం వహిస్తున్న ఈ దృక్పథాన్ని, వ్యతిరేక విధానాన్ని ఆహార ధాన్యాల వాడకం దారులుకూడ ఖండించవలసి ఉన్నది.

కాబట్టి ఆహార ధాన్యాలకు సబ్సిడీలు ఇయ్యటంలో ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాలను వెంటనే పునరాలోచించి సరిదిద్దటం అవసరం. ఆహార ధాన్యాల సబ్సిడీలకు కేటాయించిన 25 కోట్లరూపాయలను మూడింతలు చేయవలసిఉన్నది. ఇలా ప్రత్యేకించిన ఈ మొత్తాన్ని విదేశాల పాలుచేయక దేశీయ ఆహార ధాన్యాలను రైతులనుంచి గిట్టుబాటు ధరలకు కొనాలి. ఈ కొన్న ధాన్యాన్ని సంఘంలోని పేదసాదలకు అందుబాటులో ఉండేటట్లుగా చౌకగా విక్రయించాలి. ఇలా చేసినందువల్ల అటు రైతులకు ఇటు వినిమయదారులకుకూడ ప్రయోజనం కలుగుతుంది. వ్యవసాయంలో, అధికోత్పత్తి కృషిలో రైతులకు శ్రద్ధ పెరుగుతుంది. అందుచేత ప్రభుత్వం ఈకనీసపు బాధ్యతనైనా ఈ మార్గంలో నిర్వర్తించటం అవసరం. ఈ బాధ్యతను విస్మరించి అధికోత్పత్తి సాధనకు ఎంత ప్రచారం చేసినా, ఎంతగా ఉద్యమాలను నడిపినా చివరకు ఒరిగేదేమీఉండదు. ఈ బాధ్యతను విస్మరించిన పథకాలవల్ల రైతులకుగాని, వాడకం

దారులకుగాని లాభించే దేమీ ఉండదు. దేశ ఆహారసమస్య పరిష్కారం కావాలన్నప్పటికి ఈ మార్గం తప్పని సరిగా అవలంబించాలి.

ఋణ సౌకర్యాలపై నిర్బంధాలు :

ఇంత కాలంగా మనమందరం చేస్తున్న సూచనలు, గత 30 సంవత్సరాలుగా భారత రైతాంగం అడుగుతున్న కోరికలు ఇటీవల మన ప్రభుత్వం అవలంబిస్తున్న దృక్పథాన్ని బట్టి చూస్తే ఒక్కసారిగా వమ్మైఅయిపోయినవని అనిపిస్తున్నది. ప్రణాళికా సంఘం సలహాను అనుసరించి కేంద్ర ప్రభుత్వం తీసికొంటున్న దృక్పథం రైతాంగం వెన్నెముకను విరగగొట్టనున్నది. ఈక్రొత్తవిధానంవల్ల రైతులు పట్టణాలప్రయోజనాలకు లొంగిపోయి, పట్టణాల సౌకర్యాలకోసం, పరిశ్రమల బాగుకోసం బలికాగల ప్రమాదం రానున్నది. రైతులవద్ద ఉన్న ఆహారధాన్యాల నిల్వల హామీమీద, బ్యాంకులు రైతులకు అప్పులు ఇయ్యాలని మనం కోరుతున్నాం. కాని కేంద్ర ప్రభుత్వము, రిజర్వుబ్యాంకుఈ విషయంలో ఇటీవల క్రొత్తగా కొన్ని నిర్బంధ విధానాలను ప్రవేశపెట్టినవి. స్టేట్ బ్యాంకు ఇతర బ్యాంకులద్వారా ద్వారా ఈ నూతన విధానాన్ని రైతులమీద అమలుచేస్తున్నవి. రైతులు బ్యాంకులకు హామీపెట్టిన ఆహారధాన్యాలను ఈ క్రొత్త విధానంవల్ల ప్రభుత్వం నియమించిన ధరలకు, ప్రభుత్వంవారి ధాన్య సేకరణ ఏజెంట్లకు (ప్రొక్యూర్ మెంట్ ఏజంట్లకు) మాత్రమే అమ్మాలి. రైతులు తమ ఇష్టంవచ్చిన వారికి, తమకు గిట్టుబాటు అయ్యే ధరలకు అమ్ముకొనే వీలు లేదు.

ఈ మృత్యు ముఖంనుంచి తప్పించు కోవాలంటె రైతులు బ్యాంకుల సహాయం తీసికోరాదని చెప్పటానికి ఇంతకు మించిన హెచ్చరిక మరేమికావాలి? ఇది ఇలా ఉండగా దేశంలో ఆహారధాన్యాల నిల్వలకు పెద్దపెద్ద గిడ్డంగులు 400 నిర్మించాలని ప్రభుత్వం ప్రయత్నిస్తున్నది. ఇలాంటి గిడ్డంగులను చిన్నచిన్నవాటిని కొన్నివేలు స్థాపించి నిర్వహించటానికి సహకారసంఘాలను ప్రోత్సహించాలని తలపోస్తున్నది. ఈ గిడ్డంగులలో రైతులు ధాన్యాన్ని నిల్వచేస్తే ఆ యా నిల్వల హామీమీద రైతులకు ఋణసౌకర్యాలు కలిగించాలనికూడ ప్రభుత్వం ఆలోచిస్తున్నది. కాని ప్రభుత్వం వేస్తున్న ఈ పథకాలు ప్రజాబాహుళ్యంలో ప్రచారంపొంది వారిని ఆకర్షించాలంటె ఈ నూతన విధానాలు అడ్డురాకుండ ఉండగలవా? ప్రభుత్వం తన ధాన్యసేకరణ ఏజంట్లద్వారా రైతులను ఇలా పీడిస్తుండగా ఈ కొత్తపథకాలు రైతులను ఎలా ఆకర్షించగలవు? చూస్తూ, చూస్తూ రైతులు మృత్యుముఖంలో ప్రవేశించగలరా? ధాన్యసేకరణ ప్రతినిధులద్వారా, బ్యాంకుల ద్వారా ప్రభుత్వము, రిజర్వుబ్యాంకు రైతులను ఈ విధంగా పీడించ ప్రారంభిస్తే రైతులు వ్యక్తిక ఋణదాతల వికృత హస్తాలలో చిక్కకుండా ఎలా ఉండగలరు? ప్రభుత్వంవారి ఋణసహాయం ఇంత హాస్యాస్పదంగా తయారైనప్పుడు ఋణదాతల మితిమీరిన వడ్డీలను, వడ్డీవ్యాపారాన్ని ప్రభుత్వం ఎలా అరికట్టగలదు?

రైతులపట్ల ప్రభుత్వము, ప్రణాళికాసంఘము వహిస్తున్న విపరీత దృక్పథాన్ని ఇప్పటికైనా మార్చుకోవటం అవ

సరం. రైతులంటె వీరికున్న అనుమానాన్ని, వ్యతిరేకతను వీడి రైతులుకూడ తమ స్నేహితులేనని, దేశాభివృద్ధి కృషిలో భాగస్వాములని గుర్తించాలి. రైతులతో సంబంధ బాంధవ్యాలను ఎక్కువగా పెంపొందించుకోవాలి. తద్వారా ప్రభుత్వం అవలంబిస్తున్న కొత్త విధానాలు రైతుల శ్రేయస్సుకోసమే నన్న విశ్వాసాన్ని రైతులలో కలిగించాలి. వాడకందారుల అవసరాలు తీర్చవలసిందే; వారిని రక్షించవలసిందే. కాని వాడకం దారుల రక్షణ సాకుతో రైతులను బలిచేయటం మాత్రం కూడనిపని. రైతులను వాడకం దారులను సమంగాచూచి, సమంగా రక్షించవలసిన బాధ్యత, అభివృద్ధి పరచవలసిన ఆవశ్యకత ప్రతి ఒక్కరిమీద ఉన్నది.

ఆహారధాన్యాలకు కంట్రోళ్లు : ఇటీవలి విధానాలు

గత రెండు సంవత్సరాలనుంచి ఆంధ్రరాష్ట్రంలో జరిగిన విషయాలు దేశంలోని రైతులకందరకు ఒక హెచ్చరికలాగా, కనువిప్పులాగా ఉపకరించగలవు. ఆంధ్రనుంచి మామూలుగ కలకత్తా, బొంబాయి మార్కెట్లకు ధాన్యం ఎగుమతి అవుతుంటుంది. కాని కేరళలోను, ఇతర దక్షిణాది రాష్ట్రాలలోను ఉన్న వినిమయ దారుల సౌకర్యంకోసం ఈ మార్కెట్లకు ఎగుమతి అయ్యే బియ్యంపై నిషేధం విధించబడింది. రైతులకు గిట్టుబాటు అవునా కాదా అన్న ఆలోచనే లేకుండా ధాన్యానికి, బియ్యానికి కేంద్ర ప్రభుత్వం ధరలు నిర్ణయించి వేసింది. ఈ ధరలు రైతులకు గిట్టుబాటు కావు అన్న సంగతి అలాఉంచి ఆంధ్రలోని ధాన్యానికి ధరలు నిర్ణయించటంలో

ఆంధ్రప్రభుత్వాన్నికూడ ఆలోచించకుండ కేంద్రం ఈ పని చేసింది. ఆంధ్రప్రభుత్వం సూచించిన ధరలను – ఇవికూడ కేంద్రం నిర్ణయించిన ధరలకంటె అంత ఎక్కువేమీకావు – నిరాకరించి మరీ ఈ నిర్ణయంచేసింది. ఈ విధానంవల్ల ఆంధ్ర లోని బియ్యం మిల్లుల యజమానులు మితిమీరిన నష్టాలకు గురి అయ్యారు. ఈ విషయాన్ని తరువాత ప్రభుత్వమే అంగీక రించింది. బియ్యంమిల్లుల యజమానులు అధికమైన ధరలుపెట్టి ధాన్యం కొన్నారు. దీనితో వారు దెబ్బతిన్నారు. ప్రభుత్వం రైతుల ప్రయోజనాలకు విరుద్ధమైన విధానాలను అవలంబిస్తు న్నదని తెలియరాగానే చాలమంది రైతులు తమ వద్ద ఉన్న ధాన్యాన్ని అయినకాడికి తెగనమ్ముకొన్నారు. దీనితో చాల మంది రైతులుకూడ నష్టపడ్డారు. ఈ విధానంవల్ల జరిగిన మరొక నష్టం ఏమంటె అన్ని ఆహార మండలాలలో కూడ ఆంధ్రరాష్ట్రపు బియ్యానికి చాల తక్కువ ధర వుట్టింది. పైగా ఈ తక్కువ ధరను గురించి ప్రభుత్వం డాంబికంగా చెప్పుకొన్నది. ఇలా ఆంధ్ర బియ్యానికి అన్ని రాష్ట్రాల బియ్యంకంటె తక్కువ ధర వచ్చేటప్పటికి రాష్ట్రంలోని రైతులు, ధాన్యం వ్యాపారులు, బియ్యం మిల్లుల యజ మానులు నష్టాలకు గురి అయ్యారు. ఆహారమండలాల ఏర్పా టును అనుసరించి ఆ యా రాష్ట్రాలకు సరఫరా చేయువలసి ఉన్న బియ్యం సరఫరా చేసినప్పటికి మిగిలిన బియ్యాన్ని ఇష్టం వచ్చినచోట అమ్ముకోవటానికి వీలులేకుండ చేసింది ప్రభుత్వం. ప్రైవేటు వ్యాపారులు ఎగుమతిచేసికొనే ఆహార ధాన్యాలను కదిలించటానికి వ్యాగన్ల సౌకర్యం కలిగించవద్దని రైల్వే

అధికారులకు ఉత్తరువు లిచ్చింది. ఈ విధంగా ఆ యా ఆహార మండలాలకు అనుకొన్న ప్రకారం ఆహారం అందించినప్పటికి మిగిలిన ధాన్యంపై కూడ నిర్బంధాలు వచ్చిపడినవి. ఇది ఇలా ఉండగా బ్యాంకులకు అప్పులకోసం హామీపెట్టిన ధాన్యాన్ని రైతులు ఇష్టంవచ్చినట్లు అమ్ముకోరాదనే ఆంక్షకూడ వచ్చి పడింది. ప్రభుత్వం నియమించిన ధరలకు, ప్రభుత్వం నియమించిన ధాన్యసేకరణ ప్రతినిధులకు మాత్రమే రైతులు తాము హామీపెట్టిన ధాన్యాన్ని అమ్మాలి అనే నిర్బంధం పెట్టారు. ఈ పరిస్థితులలో రాష్ట్రంలోని బియ్యంమిల్లులు సమ్మెచేసినవి. ఈ సమ్మె ఫలితంగా ధరలు విపరీతంగా పెరిగిపోయి ఆంధ్ర లోని వాడకందారులు ఎన్నో బాధలు పడవలసి వచ్చింది. ఆంధ్ర బియ్యం వ్యాపారానికి, ఆంధ్రరైతులకు ప్రభుత్వం ఈ విధంగా ఉరిత్రాడుచుట్టింది. ఈ విధానంవల్ల సోవియట్ రష్యాలోవలె బియ్యం మిల్లులకు ప్రభుత్వానికి ఒక విచిత్ర మైన పోరాటం సాగింది. ఈ పోరాటంలో మధ్య రైతులు నలిగిపోయారు; వ్యాపారులు దెబ్బతిన్నారు; మిల్లుల యజమానులు నష్టాలకు గురి అయ్యారు. ఈ విషమ పరిస్థితిలో కేరళ ఒక ఆశాకిరణాన్ని చూపింది; ఈ ఉరిత్రాటిని వదులు చేయటానికి ఉపకరించింది. ఆంధ్ర బియ్యాన్ని కేరళప్రభుత్వం తానే సూటిగా ఆంధ్రలోని మార్కెట్‌లో ఉన్న–కొద్దిపాటి అధికమైన–ధరలకు కొనటానికి నిర్ణయించింది. ఇలా కొన్న బియ్యాన్ని కేరళకు తీసికొని పోవటానికి ఆంధ్రప్రభుత్వం ఆటంకాలు కలిగించలేదు. దీనితో కేంద్రంవేసిన ఉరిత్రాడు కొంచెం సడలింది.

ధాన్యానికి, బియ్యానికి గిట్టుబాటుధరలు నిర్ణయించాలని ఆంధ్రప్రజలు, రైతు ఉద్యమాలు ఎంతగా ప్రయత్నించినా కేంద్రప్రభుత్వం పట్టించుకోనేలేదు; వీరి ప్రయత్నాలు విఫలమై పోయినవి. ఆహారధాన్యాలను కొనుగోలుచేసే రాష్ట్రాలు ఆ యా తరుణాలనుబట్టి, ఆహార ధాన్యాలలోని రకాలనుబట్టి ప్రొక్యూర్‌మెంట్ ధరలకు మించిన ధరలను చెల్లించగలిగితే ఆ ధరలను స్వీకరించాలని, తద్వారా వచ్చిన లాభాన్ని రైతులకు, మిల్లుల యజమానులకు వారు వారు సరఫరాచేసిన సరుకుల నిష్పత్తిలో పంచాలని, ఇందుకు ఒక సంస్థను ఏర్పాటుచేయాలని ఎంత అడిగినా కేంద్రం వినిపించుకోలేదు. ఆహారధాన్యాల ధరల నిర్ణయ సంఘంవారు చేసిన సూచనలనుకూడ కేంద్రం లెక్కచేయలేదు. ధాన్యోత్పత్తిదారులు, రైతు ఉద్యమాలు, ధాన్యవ్యాపారులు, ధరల నిర్ణయసంఘాలు–ఇన్నీ కలిసి ఎంతచెప్పినా, ఎన్నిసూచనలు ఇచ్చినా కేంద్రప్రభుత్వానికి చీమకుట్టినంత చలనమైనా కలగలేదు. కేంద్రం తన నిరంకుశదోరణిలో తాను వ్యవహరించింది. దీని ఫలితంగా ఆంధ్ర రైతులు కోట్లాదిరూపాయలు నష్టపడ్డారు. పైగా ప్రభుత్వంలో రైతులకు విశ్వాసం పోయింది. ఇది ప్రజాస్వామిక ప్రభుత్వం అనే నమ్మకం సడలింది.

రైతులనుంచి, మిల్లులనుంచి ధాన్యం కొనుగోలు చేయటానికి అధికార ప్రతినిధులను నియమించాలని – (ఈ ప్రతినిధులు ఫ్యాక్టరీ యజమానులు కావచ్చు లేక మరొకరు కావచ్చు) ఈ ప్రతినిధులు ప్రొక్యూర్‌మెంట్ రేట్లకుమాత్రమే

ధాన్యం కొనుగోలు చేయాలని కేంద్రం ఇటీవల క్రొత్తగా ఒకే పథకాన్ని తయారు చేయబోతున్నది. ఈ ప్రొక్యూర్ మెంట్ రేట్లను నిర్ణయించేటప్పుడు ఆంధ్రప్రభుత్వంతో ఆలోచించి అనుమతిపొంద నవసరంలేదని, అలాగే రైతు ఉద్యమ నాయకులనుగాని, మిల్లుల యజమానులనుగాని ఆలోచించ నవసరంలేదని కేంద్రప్రభుత్వం భావిస్తున్నది. ఈ విధానం వల్ల కేంద్రప్రభుత్వం కంట్రోళ్ళ రాజ్యపు విషవలయంలో చిక్కుకోక తప్పదు. పైగా రైతులను అధోగతికినెట్టి, అధికారుల అహంకారానికి, దౌర్జన్యానికి పట్టంగట్టటం జరుగుతుంది. ప్రజలగతి ఏమైనా ఈ అధికారుల స్వలాభాలు పెగగటానికి ఈ పద్ధతి దారిచూపుతుంది. ఇలా చేయటంవల్ల ఇదే కాక మరొక ప్రమాదం సంభవించగల అవకాశంకూడ ఉన్నది. మిల్లుల యజమానులకు, ఇతర ప్రభుత్వ ప్రతినిధులకు చిన్నచిన్న రైతులను దోపిడిచేసే అవకాశం కలగవచ్చు. తమ అవసరాలకు పోను కొద్దో గొప్పో ధాన్యం మిగిలే రైతులు తమ మిగులు ధాన్యాన్ని ప్రొక్యూర్ మెంట్ రేటుకంటె కొంచెం అధికమైన రేట్లకు ప్రైవేటు వర్తకులకు అమ్మజూపటం సహజం. ఇలా అమ్ముకోగానే ఇక వీరి నందరను బ్లాక్ మార్కెట్ దారులనికూడ ప్రభుత్వం నిందించవచ్చు. అందుచేత దేశంలోని వేలాది చిన్నచిన్న వర్తకులు, రైతులు నెత్తిని మూటలుపెట్టుకొని తిరిగేవారు ప్రభుత్వంవేసే బ్లాక్ మార్కెట్ దారులన్న ముద్రకు గురికావలసి వస్తుంది. ఈ చిన్నచిన్న వర్తకులు, నెత్తిమూటలవారు రైతులవద్ద ఉండే కొద్దిపాటి మిగులు ధాన్యంకొని పట్టణాలలోను, అక్కడక్కడ

ఉండేవారికి అందిస్తూ ఉంటారు. ఇలా తమ పొట్టపోసికొంటు ఉంటారు. ఇంతటి శ్రమతో సంఘంలో ఒక అత్యావశ్యక మైన కృషిని నెరవేరుస్తున్న వీరందరు బ్లాక్ మార్కెట్ దారులన్న నిందకు గురై పోలీసులదోపిడికి దాసోహం అన వలసిన గతి పడుతుంది. సంఘాన్ని చీడ పురుగులవలె పీడి స్తున్న సంఘ వ్యతిరేకశక్తులు ఈ అవకాశాన్ని తమ స్వప్ర యోజనాలకు వినియోగించుకొని వీరిని దోపిడిచేయటం సంభవం కావచ్చు. కాబట్టి ధాన్యం, బియ్యం కొనుగోలుకి అమ్మకానికి రవాణాకు సంబంధించిన వ్యాపారం మొత్తాన్ని ప్రభుత్వమే గుత్తకు తీసికోరాదు. తనకు కావలసిన ధాన్యాన్ని మాత్రమే ప్రభుత్వం కొనాలి. ప్రభుత్వవ్యాపారం అంతవరకే పరిమితంకావాలి. ఈ కావలసిన ధాన్యాన్ని ప్రభుత్వం మిల్లు యజమానులవద్దగాని, వర్తకులవద్దగాని కొనవచ్చు; లేదా సూటిగా రైతులవద్దనుంచే కొనవచ్చు. అంతేకాని, తనకు కావలసిన ఆహార ధాన్యాలకోసమని మొత్తం వ్యాపార రంగాన్ని నిర్బంధించకూడదు. ఇలాచేస్తే ప్రభుత్వావసరాలకు పోను మిగిలిన ఆహారధాన్యాల వ్యాపారంలో ఆయా వ్యక్తు లకు స్వేచ్ఛ ఉంటుంది. తనకు అవసరమైనప్పుడల్లా ప్రభుత్వం తనకు కావలసిన ధాన్యాన్ని మార్కెట్ ధరలప్రకారం కొనాలి. ప్రొక్యూర్‌మెంట్ ధరలప్రకారంకూడ కొనవచ్చు గాని ఈ ప్రొక్యూర్‌మెంట్ ధరలను రాష్ట్రప్రభుత్వ ఆమోదం తోను, రైతులతోను, రైతునాయకులతోను, మిల్లు యజ మానులతోను చర్చించిన తరువాతనే నిర్ణయించాలి. అలా నిర్ణయించబడిన ప్రొక్యూర్‌మెంట్ ధరలకు కొనవచ్చు. చిర

కాలంగా కోరబడుతున్న ధరలస్థిరీకరణ పథకం వచ్చేలోపుగా తాత్కాలికమైన ఏర్పాట్లుగా ఇవన్నీ జరగాలి.

భూ సంస్కరణలు

భూ సంస్కరణలకోసం కాంగ్రెసుతోసహా దేశంలోని అన్ని రాజకీయపార్టీలు అంతులేని ఉద్యమం లేవదీసినవి. ఈ సందర్భంలో ఒక్క విషయం అడగటం ధర్మంగా భావిస్తున్నాను. ఈ భూ సంస్కరణలద్వారా మీరు ఆశిస్తున్నది ఏమిటి? అని మన ప్రజలను ప్రశ్నిస్తున్నాను. భూములులేని వ్యావసాయకులకు ఈ భూసంస్కరణలద్వారా కొద్దో, గొప్పో సొంతభూమిని ఏర్పాటుచేసి తద్ద్వారా వారినికూడ స్వయంకల్పిత వృత్తిగల రైతులనుగా చేయాలనేది మన ఆశయం అయిన పక్షంలో ఈ భూసంస్కరణలకంటె ముందుగా చేయవలసిన పని ఒకటి ఉన్నది. లక్షలాది ఎకరాలు ప్రభుత్వ భూములున్నవి. వీటిని సాగుకి యోగ్యం చేయటానికి కావలసిన పెట్టుబడిపెట్టి ముందు ఈ భూములను స్థానికంగా ఉన్న భూములులేని వ్యావసాయకులకు పంచాలి. ఇంక మిగిలిఉంటే ఇతర ప్రాంతాలవారికికూడ ఇయ్యాలి. ఇలా ఉపయోగించుకొనగల భూమి ఒక్క ఆంధ్రరాష్ట్రంలోనే 40 లక్షల ఎకరాలు ఉన్నది. సొంతభూములులేని వ్యావసాయకులకు పంచటానికి ఇలాంటి భూమి దేశం మొత్తంలో కోట్లాది ఎకరాలు ఉన్నది. ఈ భూములను సాగుకి యోగ్యంచేసి సొంతభూములు లేనివారికి పంచితే అది నిర్మాణాత్మకమైన విప్లవ పూరితమైన పథకం కాగలదు

గదా! మరి ఇలాంటి పనికి పూనుకోకుండా భూసంస్కరణ లను ప్రవేశపెట్టటానికి ఆంధ్రప్రభుత్వం ఇంతగా ఉరకలు వేయ వలసిన అవసరం ఏమిటి? ఈ భూసంస్కరణలు చేసి నప్పటికి లభించే మిగులు భూమి మహా అయితే రెండు మూడులక్షల ఎకరాలుమాత్రమే. ఈ రెండు మూడు లక్షల ఎకరాలభూమిని కూడ ప్రభుత్వం పరిహారం చెల్లించకుండ వశం చేసికొనే వీలు లేదు. పైగా ఈ సంస్కరణలవల్ల సంఘంలో అశాంతి బయలుదేరటం చూస్తూనే ఉన్నాం. ఇంతేకాక వ్యవ సాయంలో ఇక ముందు పూర్వపు శ్రద్ధాసక్తులతో పెట్టుబడి పెట్టటం జరగదనికూడ తేలికగా గ్రహించవచ్చుగదా! తన వద్ద ఉన్న భూమిని ప్రభుత్వం సక్రమంగా వినియోగించాలి. అది చేయకుండ సాంఘికంగా ఇన్ని అనర్ధకాలకు దారి తీయ గల భూసంస్కరణల నినాదాన్ని భుజాన వేసికోవటంవల్ల లభించే ప్రయోజనం ఏమిటి?

వాస్తవంగా వ్యవసాయం చేస్తున్న రైతులకు లాభం కలిగించాలనేదే కనుక వారి ఆశయమైతే కౌలుదారులకు రక్షణ కలిగించే శాసనాలను ప్రవేశపెట్టటం ప్రధానావశ్యకం; ఇది సబబుకూడాను. ఈ పెద్ద పెద్ద భూస్వాముల పట్టా భూములమీద కౌలుదారులకు రక్షణ కలిగించే విధంగా ఈ శాసనాలు రూపొందాలి. కేవలం ఇలాంటి శాసనాలను చేయుటమేకాక వాటిని సమర్ధవంతంగా ఆచరణలో పెట్టాలి. ఈ శాసనాలవల్ల కౌలుదారులకు, రైతులకు నిజమైన రక్షణ, ప్రయోజనం కలిగేటట్లు చూడాలి. ఆంధ్ర, బొంబాయి, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలలో ఈ కౌలుదారుల రక్షణ శాస

నాలు ఇదివరకే ఉన్నవి. అవసరమనుకొన్నప్పుడు ఈ శాసనాలను సవరణలను చేసికోవచ్చు. ముఖ్యంగా భూస్వాములకు, కౌలుదారులకు తగాదాలు పెరిగే అవకాశం లేకుండా ఈశాసనాలను సవరించుకోవటం అవసరం. సొంతంగా సేద్యం చేయని వారు అంత ఎక్కువగా ఉండటం మంచిదికాదని, ఈ లాంటి పరోక్ష భూస్వాముల క్రింద పెద్దపెద్ద భూకమతాలు ఉండటం శ్రేయస్కరంకాదని భావించిన పక్షంలో తన్నివారణకు చర్యలు తీసికోవచ్చు. మీ మీ భూములను కొని సొంతం చేసికొనే అవకాశం మీ కౌలుదారులకు ఇస్తున్నామని ఈ పరోక్ష భూస్వాములకు ప్రభుత్వం ఒక హెచ్చరిక చేయవచ్చు. ఇలాంటి భూములను మార్కెట్ ధరల ప్రకారం గాని లేక ల్యాండ్ ఎక్విజిషన్ చట్టం ప్రకారం నిర్ణయింపబడగల ధరలకు గాని కౌలుదారులు కొనుక్కొనే అవకాశం కలిగించవచ్చు. ఆ యా భూస్వాములు సొంతంగా వ్యవసాయం చేసికోదలచిన పక్షంలో తమ భూమిలో కొంత భాగాన్ని వారు ఉంచుకో గలగటానికి ఇందుకోసం చేసే శాసనంలో కొంత వ్యవధి ఇయ్యటం కూడ అవసరం. శారీరకంగా సరైన స్థితిలో లేక వికలాంగులైనవారిని, విధవలను, పిల్లలకు రక్షణశాఖలో వారిని ఇలాంటి శాసనాలనుంచి మినహాయించాలని ప్రణాళికా సంఘం ఇదివరకే సూచించింది. తమ కాలాన్ని పూర్తిగా ప్రజాసేవకే వినియోగిస్తున్నవారికి, శాసనసభ్యులకు కూడ ఈ సౌకర్యం కలిగించి ఈ శాసనాలు వీరికికూడ వర్తించకుండ చేయటం అవసరం.

ఈ భూసంస్కరణలకు పెద్ద పెద్ద భూకమతాలు ఏర్పడ కుండ చూడటమే ఆశయమైన పక్షంలో ఇదిగో ఇంతకు మించిన భూస్వాములు ఇకముందు భూములను కొనరాదని ఆంక్షపెట్టవచ్చు. ఒక గరిష్ఠ పరిమితి నిర్ణయించి ఆ పరిమితికి మించి భవిష్యత్తులో ఎవరూ భూములను కొనరాదని, వారస త్వంగానైనా, దానధర్మాల రూపంలోనైనా తీసికోరాదని నిర్బంధాలు పెట్టవచ్చు.

ఇదికాక ఈ భూసంస్కరణలకు మరొక ఆశయం ఉన్నదని మనవారు చెప్పవచ్చు. ఆదాయానికి ఒక పరిమితి నిర్ణయించి ఆ పరిమితికి మించిన ఆదాయాన్ని ఇచ్చే భూములు ఎవరికీ ఉండరాదనేది ఆశయం అని చెప్పవచ్చు. ఆ పక్షంలో ఈ గరిష్ఠ పతిమితి ఒక్క భూ ఆస్తులకే ఎందుకు విధించాలి అన్న ప్రాథమిక ప్రశ్నవస్తున్నది. రైతులందరు తమ తమ భూము లను సొంతంగా సాగుచేసికొంటున్నప్పుడు, కౌలుదారులకు రక్షణలు ఉన్నప్పుడు ఇలాంటి పరిమితులను ఒక్క వ్యవసాయ రంగంలోనే ఎందుకు పెట్టాలో కారణం తెలియదు. అన్ని వస్తువుల ధరలు దినదినం అంతులేకుండా పెరిగి పోతుండగా తదనుగుణంగా రైతుల ఆదాయాలు పెరగటంలేదు. ఉద్యో గుల వేతనాలు, పట్టణాలలోని ఇతర వృత్తులవారి ఆదా యాలు మాత్రం పెరుగుతూనే ఉన్నవి. వాస్తవ పరిస్థితి ఇలా ఉండగా, రైతులకంటె ఆదాయాలు పెరుగుతున్న ఇతర వర్గాలవారి ఆదాయాలకు పరిమితులు విధించటానికి మాత్రం ఇష్టపడక రైతులమీద మాత్రమే ప్రభుత్వం ఈ అస్త్రాన్ని ఎందుకు ప్రయోగిస్తున్నదో అర్థంకావటంలేదు. ఇది సాంఘిక

న్యాయంకాదు. సాంఘిక న్యాయసాధన పేరుతో ఇలాంటి పాక్షికవైఖరి వహించటం విచారకరం.

ప్రభుత్వానికి ఎవరిఎడల ద్వేషంలేదు, పక్షపాతంలేదు, ప్రభుత్వం అందరను చూస్తున్నది అని రుజువు చేసికోవటానికి ఇతర రంగాలలోని ఆస్తులకుకూడ గరిష్ఠ పరిమితులు విధించటానికి ప్రభుత్వం పూనిక వహించాలి; ప్రభుత్వోద్యోగుల ఆదాయాలకు పరిమితులు పెట్టటానికి ముందుకురావాలి. స్వాతంత్ర్య సంపాదనానంతరం ఈ ప్రభుత్వోద్యోగుల సంఖ్య రెట్టింపుకి మించి పెరిగిపోయింది. ఈ పనులన్నీచేసి ఇతర రంగాల ఆదాయాలకు కూడ పరిమితులు విధించి ప్రభుత్వం తన నిష్పాక్షికతను రుజువుచేసికోవాలి. సాంఘిక న్యాయ సాధన అన్న ఆదర్శానికి అప్పుడే అవకాశం ఉంటుంది. ప్రభుత్వం ఇలా చేయని పక్షంలో సాంఘిక న్యాయం పేరుతో ఒక్క భూ ఆస్తులమీద మాత్రమే విధించబోతున్న పరి మితులు మనం అంగీకరించాలనటంలో సబబు ఉన్నదేమో ఆలోచించండి. విశాలదృక్పథం, న్యాయపక్షపాతం కల వారందరు ఈ విషయాన్ని పరిశీలించండి. అసలు భూ ఆస్తులపై పరిమితులు విధించటం అన్నది భూసంస్కరణలలో ఒక భాగం కాదు; కావలసిన అవసరంలేదు. భూకమతాలకు గరిష్ఠ పరిమితులు విధించటం అన్న సూత్రంవల్ల గ్రామీణ [illegible] క వ్యవస్థకు అదనంగా రాగల ప్రయోజనం ఏమీలేదు; ఈ విధానంవల్ల అధికోత్పత్తికూడ లభ్యంకాదు. ఈ విధానం వ్యవసాయదారుల బాధలను ఏ విధంగానూ తీర్చలేదు. వాస్తవానికి భూమి చాలవరకు చీలే ఉన్నది; కొద్ది కొద్దిగా

అందరికి ఉండనేడున్నది. రైతువారీ ప్రాంతాలలో ఈ లక్షణం ప్రత్యేకంగా గోచరిస్తుంటుంది. జమీందారీలను రద్దు చేసిన తరువాత భూ ఆస్తుల కేంద్రీకరణ మరింత తగ్గిపోయింది. దీని కంతకు కారణమైన 'మితాక్షరి' విధానానికి ఈ సందర్భంలో మనం కృతజ్ఞత వెల్లడించవలసి ఉన్నది. భూ ఆస్తులవలె వికేంద్రీకృతమైఉన్న ఆస్తి మన దేశంలో మరొకటిలేదు. అందుచేతనే అన్ని రకాల ఆస్తులమీద, ఆదాయాలమీద పరిమితులు విధించాలని కోరుతున్న మనకు ప్రణాళికా సంఘ పాక్షిక వైఖరినిచూస్తే ఆందోళన కలుగుతున్నది. ప్రభుత్వాం రాజకీయపక్షాలు ఈ ధోరణికి తల ఒగ్గటం చూస్తే బాధ కలుగుతున్నది. రైతుల క్షేమానికి విరుద్ధంగాఉన్న ఈ విధా నాన్ని వ్యతిరేకించాలనికూడ అనిపిస్తున్నది. అందుచేత ఇంత ముఖ్యమైన ఈ విషయాన్ని గురించి మన నాయకులు మరొక సారి దీర్ఘంగా ఆలోచించాలని కోరుతున్నాం. భూసంస్కరణ లను గురించి ప్రభుత్వాం తీసికొంటున్న ఈ పాక్షికవైఖరివల్ల సొంతభూములను సాగుచేసికొంటున్న రైతుల ఉత్పత్తి కృషి మందగించవచ్చు; తమ భూములు తమకు ఉండబోతున్నవా అన్న సంశయం వారికి కలగవచ్చు. అందుచేత ఇలాంటి భూ సంస్కరణలు ఉత్పత్తినికూడ పెంచలేవని ప్రభుత్వాధి నేతలు గమనించటం అవసరం.

సోవియట్, కేపిటలిస్టుదేశాలసోషలిజం ఇక్కడ స్థాపించా లని మన ప్రభుత్వాము, ప్రణాళికాకారులు ఆశిస్తున్నారు. సోవియట్ సోషలిజం రైతాంగానికి బద్ధశత్రువు అన్న విషయం లోకానికి తెలిసినదే. ఇలాంటి సోషలిజాన్ని స్థాపించ

బూని ఈ సోషలిజంకోసం ప్రారంభించిన యజ్ఞంలో రైతాంగాన్ని మొదటి బలిపశువును చేయాలని మన వారు నిర్ణయించుకొన్నట్లున్నారు. ఏమైనా ఈ ఆస్తుల పరిమితిని డబ్బు రూపంలో లెక్కించి విధించటానికి మాత్రం వీలులేదు. లోటుబడ్జెట్‌లవల్ల, ప్రణాళికా వ్యయంవల్ల రూపాయి విలువ పడిపోతున్నది. అందుచేత ధనరూపంలో లెక్కించి మాత్రం ఆస్తులమీద పరిమితి పెట్టకూడదు. ఒక వేళ ప్రస్తుతపు రేట్ల ఆధారంతో ఆదాయాన్ని నిర్ణయించి ఆ ఆదాయంమీద పరిమితులు పెట్టిన పక్షంలో రైతులు తమకు ఆర్థికాదాయాన్ని సమకూర్చే ఇతర కార్యకలాపాలను మానుకోవలసి వస్తుంది; తమకు కాస్తో కూస్తో సహాయకారులుగా ఉంటున్న ఫలవృక్షాల పెంపకం, పట్టు పురుగుల పెంపకం, కూరగాయల పెంపకం, పశువిస్తరణ మొదలైన వాటిపట్ల రైతులకు శ్రద్ధ పోతుంది. అందుచేత ఈ భూకమతాలపై విధించనున్న పరిమితులు స్టాండర్డ్ ఎకరాల రూపంలోనే ఉండాలి. అంటే పరిమితులు విధించటంలో భూవిస్తీర్ణాన్ని ఆధారంగా తీసికోవాలి. ఒక రైతుకుటుంబానికి నెలకు కనీసం రు 500 లు ఆదాయం సమకూర్చగల భూమి ఉండటానికి అంగీకరించాలి. భార్యాభర్తలు, ఒకరిద్దరు పిల్లలుగల కుటుంబానికి ఇంత మాత్రపు టాదాయాన్నైనా అంగీకరించాలి. రైతు తన కుటుంబానికి నెలకు రూ 500 లు ఆదాయం కావాలని కోరుకోవటాన్ని ఎవరూ ఆక్షేపించలేరు గదా! సొంత భూములు లేని శ్రామికుడుకూడ ట్రేడ్ యూనియన్ల సహకారంతో, ప్రభుత్వ రక్షణతో ఇంత ఆదాయాన్ని సమకూర్చుకొనగల

అవకాశాలు లభిస్తున్నప్పుడు తనకు తానే యజమాని అను కొంటున్న రైతు తనకు ఆపాటి ఆదాయం ఉండాలను కోవటంలో తప్పు ఏమీ లేదు గదా! పైగా కార్మికులకు ప్రభుత్వమే గృహవసతి కల్పిస్తున్నది; లేబర్ కాలనీలు పెట్టి ఆధునిక సౌకర్యాలన్నీ సమకూరుస్తున్నది. ఇవన్నీ మన రైతులకు కలలోకూడ లభ్యమవుతాయా? కార్మికులకు ఈ సౌకర్యాలు లభిస్తున్నందుకు ఆక్షేపణ చెపుతున్నామనిగాని, ఈర్ష్యపడుతున్నామనిగాని భావించరాదు. ఈ సౌకర్యాలన్నీ వారికి కావలసిందే. అదే సౌకర్యాలు రైతులకుకూడ కావాలని మాత్రమె మేము ప్రత్యేకించి కోరుతున్నాం.

దేశంలోని వివిధ ప్రదేశాలలోగల ప్రభుత్వ పారిశ్రామిక సంస్థలను, దేశరక్షణ వస్తూత్పత్తి సంస్థలను ఇటీవలనే సందర్శించటం జరిగింది. ఆ సందర్భంలో ఆయా పారిశ్రామిక సంస్థలలోని (హిందూస్తాన్ ఎయిర్ క్రాఫ్టు, ఇండియన్ టెలిఫోన్స్, భారత్ ఎలక్ట్రానిక్స్, హిందూస్తాన్ మెషిన్ టూల్స్, హిందూస్తాన్ యాంటి బయోటిక్స్, ఇంటిగ్రేటెడ్ కోచ్ ఫ్యాక్టరీ మొదలైనవి) శ్రామికులకు లభిస్తున్న వేతనాలు, ఉద్యోగ నిబంధనలు, రక్షణలు, శిక్షణ, ప్రమోషన్లు, గృహవసతి, సాంఘిక భీమాసౌకర్యాలు, ప్రమాదాల సందర్భాలలో లభించే రక్షణలు మొదలైనవి పరిశీలించాను. ఈ సౌకర్యాలు అంత తేలికగా మాటలతో లభించేవికావు. నెలకు రు 500 ఆదాయం వచ్చినప్పటికి రైతుకి ఇవన్నీ లభ్య మవుతాయని ఎవరూ అనుకోలేరు. అందుచేత రైతుకి నెలకి రు 500 ఆదాయం ఉండాలన్న ఈ కోరికను గురించి మన

ప్రణాళికాకారులకు హేతుబద్ధమైన ఆక్షేపణ ఏమైనా ఉంటుందా?

కాంగ్రెసు నాయకులు, ఉపనాయకులు ఈ విషయాల నన్నింటిని నిష్పాక్షికంగా ఆలోచించాలి. అంతేకాక రైతాంగ వ్యతిరేక పక్షాలనుకాదని కాంగ్రెసుపార్టీకి వోట్లిచ్చి గద్దె కెక్కించినదికూడ ఈ రైతాంగమేనని వారు మరచి పోకూడదు. కాంగ్రెసుపార్టీని విశ్వసించింది, గెలిపించింది రైతులే. రైతుల సమంజసమైన కోర్కెలను తీరుస్తారని, కమ్యూనిస్టు విధానాలతో ప్రత్యక్షంగానో పరోక్షంగానో రైతాంగాన్ని, సొంతకమతాలను రద్దుచేయకుండ కాపాడ తారని ఎన్నో ఆశలు పెట్టుకొని రైతులు కాంగ్రెసును గెలి పించారు. అందుచేత కాంగ్రెసునాయకులు, ఉపనాయకులు, ప్రజలు ఈ రైతాంగ వ్యతిరేక ధోరణిని గురించి మరొక తూరి పరిశీలించుకోవటం ఎంతైనా అవసరం. రైతులుకూడ ఇదివరకటివలె నిద్రాణంగా ఉంటే లాభం లేదు; ఈనాడు జరుగుతున్న విషయాలను గ్రహిస్తూ చైతన్యవంతులై మెల గాలి; చిరకాలంగా తాము అనుభవిస్తున్న స్వయంవృత్తి గౌరవాన్ని, హోదాను రక్షించుకోవటంకోసం సంఘటితమై ఉద్యమాలను నడుపుకోవాలి. ఇంతకాలంగా తమకు స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను ప్రసాదిస్తూ, పనిపాటలను చూపిస్తూ, స్వతంత్ర జీవనం చేయటానకి ఆలంబనంగా ఉంటున్న తమ ప్రాణప్రదమైన సొంత కమతాలను రక్షించు కోవటానికి రైతులు ఇకనైనా పూనిక వహించాలి.

# ఒక మాట

భారతదేశ ఆర్థికవ్యవస్థను ప్రణాళికా సంఘంవారు, 'ప్రభుత్వ రంగం, వ్యక్తికరంగం' అని రెండుగా విభజించి దేశంలోని అసంఖ్యాక స్వయం కల్పిత వృత్తిదారులను వ్యక్తికరంగంలో ఒక భాగంగా చేసివేశారని, ఈ దృక్పథం దోషభూయిష్ఠమైనదని, ఈ స్వయం కల్పిత వృత్తి వ్యవస్థను భారత ఆర్థిక వ్యవస్థలో ప్రత్యేకంగా గుర్తించి బలపరచవలసిన అవసరం ఉన్నదని ఆచార్య రంగాగారు ఈ గ్రంథంలో విపులంగా విమర్శనాత్మకంగా పరిశీలించి రుజువు చేశారు. ఈ నూతన భావస్రవంతిని ఆంధ్రపాఠకులకు అందించాలన్న సంకల్పమే ఈ అనువాదానికి కారణం.

జాస్తి జగన్నాథం